# ప్రజాపక్షం

## జిల్లా అనుబంధం

హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు

మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

బుధవారం 29 | ఏప్రిల్, 2026 | పేజీలు :08


## సరిపడా పెట్రోల్ డీజిల్ నిల్వలు

### మెదక్ ఆర్డీఓ రమాదేవి



**ప్రజాపక్షం/మెదక్ :** మెదక్ లో సరిపడా పెట్రోల్, డీజిల్ నిల్వలు ఉన్నాయని మెదక్ ఆర్డీఓ రమాదేవి తెలిపారు. మంగళవారం మెదక్ పట్టణంలోని శ్రీనివాస పెట్రోల్ పంపును తహసిల్దార్ లక్ష్మణ్ బాబుతో కలిసి పరిశీలించారు. అదే సమయంలో 12000 లీ.ఆయిల్ ట్యాంకర్ (8000పెట్రోల్, 4000 డీజిల్) రావడంతో ప్రస్తుత పెట్రోల్ నిల్వ 29,232 లీ ఉన్నాయన్నారు. ప్రస్తుత డీజిల్ నిల్వ 26,667 లీ నిల్వ ఉన్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతం సరిపడా పెట్రోల్, డీజిల్ లభ్యత కలదన్నారు. కావున వినియోగదారులు గమనించి కలత చెందే అవసరం లేదని కోరారు. అనంతరం మెదక్ మండలం రాజ్ పల్లి లోని పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. గన్ని సంచుల వివరాలు, తాగునీటి సౌకర్యం గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కాగా ఇప్పటి వరకు 1200 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేశామని సిబ్బంది తెలిపారు. ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని సిబ్బందికి ఆర్డీఓ సూచించారు.



## విద్యార్థుల సమస్యలు పరిష్కరించకుండా అక్రమ అరెస్టులా.. ?

### ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆశ రాజు

**ప్రజాపక్షం/మెదక్ :** విద్యార్థుల న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం స్పందించాల్సిన సమయంలో అక్రమ అరెస్టులకు పాల్పడటం తీవ్రంగా ఖండిస్తున్నామని అఖిలభారత విద్యార్థి సమాఖ్య ఎఐఎస్ఎఫ్ నాయకులు ఒడిపడ్డారు. మెదక్ జిల్లాలో విద్యార్థి ఉద్యమాన్ని అణచివేయాలని ప్రభుత్వం ప్రయత్నించడం సిగ్గుచేటని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆశ రాజు విమర్శించారు. మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసానికి పాదయాత్రగా వెళ్లేందుకు సిద్ధమైన ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు, సభ్యులను పోలీసులు తెల్లవారుజామునే వారి ఇళ్ల వద్ద నుంచి అదుపులోకి తీసుకున్నారు. ఉదయం 5 గంటల సమయంలో నాయకులను అరెస్టు చేసి స్థానిక హవేలి ఘనపూర్ పోలీసు స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా ఆశ రాజు మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాల్సిన ప్రభుత్వం, పోలీసు దౌర్జన్యాలకు దిగడం బాధాకరం అని మండిపడ్డారు. ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్‌ల విడుదలలో తీవ్ర ఆలస్యం జరుగుతుండగా, వేలాది మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అగ్రహం వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా పాదయాత్రకు వెళ్తుంటే అరెస్టులు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని పేర్కొన్నారు. విద్యార్థులపై కేసులు నమోదు చేయడం, అక్రమంగా అరెస్టులు చేయడం వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



## లారీని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు.. 15 మంది ప్రయాణికులకు గాయాలు

**ప్రజాపక్షం/మెదక్/కొల్చారం :** ముందు వెళ్తున్న వడ్ల లోడు లారీని వెనుక వైపు నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో బస్సులో ప్రయాణిస్తున్న 15 మంది ప్రయాణికులు గాయాల పాలైన సంఘటన మంగళవారం మధ్యాహ్నం మండల కేంద్రమైన మెదక్ జిల్లా కొల్చారంలో మూతపడిన ఇండియన్ ఆయిల్ పెట్రోల్ పంపు వద్ద జరిగింది. బోధన్ డిపోకు చెందిన సూపర్ లగ్జరీ బస్సు సికింద్రాబాద్ నుంచి బోధన్ వెళుతుండగా మార్గమధ్యలో కొల్చారం ఇండియన్ ఆయిల్ పెట్రోల్ పంపు సమీపంలో ఎదురుగా వెళ్తున్న వడ్ల లోడు లారీని వెనకవైపు నుంచి కొట్టడంతో బస్సులో ప్రయాణిస్తున్న మెదక్ ఎల్లారెడ్డి బోధన్ ప్రాంతాలకు చెందిన 15 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. వీరిలో ఐదుగురు పరిస్థితి విషమంగా ఉంది. నాలుగు 108 వాహనాల సహాయంతో క్షతగాత్రులను మెదక్ జిల్లా ఆసుపత్రికి చికిత్స నిమిత్తం పంపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కొల్చారం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ బస్సులో కండక్టర్ లెకపోవడం ఆ డ్రైవర్ కండక్టర్‌గా, డ్రైవర్‌గా నిధులు నిర్వర్తిస్తూ బస్సును అతివేగంగా నడపడం వల్లే ప్రమాదం జరిగింరని ప్రయాణికులు తెలిపారు.

## డిజిటల్ స్వీయగణనతో సులభంగా 'జనగణన'

### జనగణన స్వీయ నమోదు చేసుకున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

### స్వీయగణనను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపు





**ప్రజాఫక్షం/సంగారెడ్డి :** జనగణన ప్రక్రియలో భాగంగా జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో స్వీయ నమోదు చేసుకున్నారు. జన గణనలో ఎవరికివారు స్వయంగా వివరాలు నమోదుచేసుకునేలా అందుబాటులోకి తెచ్చిన ఆన్‌లైన్ వెబ్‌సైట్ https//secensus.gov.in ద్వారా తన వివరాలను నమోదు చేసుకున్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం అదనపు కలెక్టర్ పాండు సెన్సెస్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రమాదేవి సిపిఒతో కలిసి కలెక్టర్ మీడియా ప్రెస్‌మీట్ ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జనగణన ప్రక్రియను సులభంగా, సమగ్రంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం డిజిటల్ స్వీయ గణన విధానాన్ని అందుబాటులోకి తెచ్చిందని అన్నారు. ఆన్‌లైన్ ద్వారా ప్రజలు తమ వ్యక్తిగత కుటుంబ వివరాలను వెబ్ పోర్టల్‌లో కాని, మొబైల్ యాప్ ద్వారా స్వయంగా నమోదు చేసుకునే వెసులు బాటు కల్పించారని కలెక్టర్ తెలిపారు. స్వీయ గణన ఈనెల 26 నుండి ప్రారంభమైందని మే 10 తేది వరకు స్వీయ నమోదు చేసుకోవచ్చని సూచించారు. ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన డిజిటల్ స్వీయ గణన ప్రక్రియను జిల్లాలోని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలు గోప్యంగా ఉంచబడతాయని భరోసా కల్పించారు.

**ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించాలి**

ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రతి రోగికి మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించాల్సిన బాధ్యత వైద్య సిబ్బందిపై ఉందని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ పేర్కొన్నారు. మంగళవారం నారాయణఖేడ్ మండలం తుర్కపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో నిర్వహణ విధానాన్ని సమగ్రంగా పరిశీలించారు. రిజిస్టర్లు తనిఖీ చేయడంతో పాటు ల్యాబ్, ఫార్మసీ తదతర విభాగాలను పరిశీలించారు ఆసుపత్రికి వచ్చిన రోగులతో కలెక్టర్ మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితి గురించి ఆరా తీశారు. గర్భిణులతో ప్రత్యేకంగా మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలు చెకప్‌లు క్రమం తప్పకుండా జరుగుతున్నాయా అనే విషయాలను తెలుసుకున్నారు. ఆసుపత్రిలో డాక్టర్లు సిబ్బంది సమయపాలన పాటిస్తున్నారా అవసరమైన మందులు , అందుబాటులో ఉన్నాయా, అనే అంశాలపై సంబంధిత అధికారులను ప్రశ్నించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఇతర అత్యవసర మందులు అందుబాటులో ఉన్నాయని మెడికల్ ఆఫీసర్ తెలిపారు. ప్రతి రోజు ఇన్‌పేషంట్స్, ఔట్ పేషెంట్స్ సంఖ్య గర్భిణీల చెకప్‌లు అందుబాటులో ఉన్న పరీక్షలు ప్రతి నెల జరిగే ప్రసవాల సంఖ్య తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ ఉమా హారతి, ఎంపిడిఒ మెడికల్ ఆఫీసర్ తదితరులు పాల్గొన్నారు.

## బెజ్జంకి-బేగంపేట రోడ్డు నిర్మాణ పనులు పూర్తిచేయాలి

### సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పోతిరెడ్డి వెంకట్‌రెడ్డి



**ప్రజాపక్షం/బెజ్జంకి :** బెజ్జంకి–బేగంపేట గ్రామాల మధ్య అసంపూర్తిగా నిలిచిపోయిన ప్రధాన రోడ్డు నిర్మాణ పనులను తక్షణమే పూర్తి చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పోతిరెడ్డి వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని బేగంపేట గ్రామంలోని స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద సిపిఐ ఆధ్వర్యంలో గ్రాస్తులతో కలిసి నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతూ మండల కేంద్రంలోని రహదారులను నిర్లక్ష్యం చేయడం అత్యంత దారుణమని అన్నారు. గత ప్రభుత్వం మండల కేంద్రం నుండి బేగంపేట గ్రామం వరకు రోడ్డు నిర్మాణ పనులను చేపట్టి అర్ధంతరంగా వదిలివేయడంతో రోడ్డుపై కంకర తేలి ప్రమాదకరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలకు వివిధ అవసరాల కోసం ప్రజలు నిత్యం ఇదే ప్రధాన రహదారి వెంట ప్రయాణం చేయాలని మండల కేంద్రానికి వెళ్ళలంటే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతుపడుతున్నారని, ప్రాణాలను అరచేతులో పెట్టుకొని వెళ్ళవలసి వస్తుందని అన్నారు. ఇప్పటికైనా స్థానిక ఎంఎల్ఎ స్పందించి అసంపూర్తిగా నిలిచి పోయిన రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేసి, సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సిపిఐ పక్షనా డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.





హృదయ విదారకం...

## కన్న కొడుకులు ఇద్దరితో సహా తండ్రి ఆత్మహత్య

భార్య,భర్తల మధ్య నెలకొన్న కలహాలు అభం శుభం తెలియని ఇద్దరు చిన్నారి కొడుకులను బలితీసుకుంది. చివరకు ఆవేశంలో తండ్రి కూడా ఆ కన్నకొడుకులతో సహా ఆత్మహత్య చేసుకున్నారు.

# ప్రాణం తీసిన ఈత సరదా

**ప్రజాపక్షం/సంగారెడ్డి :** వేసవి తాపానికి చల్లని నీటిలో స్నేహితులతో కలిసి ఈత కొడదామన్న ఆ యువకుడి సరదా అతడి ప్రాణాలనే తీసింది. ఈ సంఘటన సంగారెడ్డి జిల్లా కేంద్ర శివారులోని మంజీరా డ్యాంలో చోటు చేసుకుంది. ఈస్ట్ గోదావరి జిల్లాకు చెందిన గొల్లంకి గణేష్ (25) ఈ నెల 26 సాయంత్రం కల్పగూరు గ్రామ పరిధిలోని మంజీరా డ్యామ్‌కి తన స్నేహితులతో కలిసి వచ్చాడు . సాయంత్రం డ్యాంలోని నీటిలో దిగి ఈత కొట్టేందుకు ప్రయత్నించారు. ఈత సరిగా రాకపోవడంతో ఆ నీటిలో కొట్టుకుపోయాడు. ఈ విషయం తెలుసుకున్న సంగారెడ్డి రూరల్ పోలీసులు గజ ఈతగాళ్ల సహాయంతో ఈ నెల 27 న అతడి మృతదేహాన్ని బయటికి తీయించారు. అయితే మృతి చెందిన యువకుడు ఇస్నాపూర్ పరిధిలోని పెన్నాకోర్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ ఇక్కడే ఉంటున్నాడు. ఇదిలా ఉంటే ఓ వైపు పోలీసులు నీటి ప్రవాహాల వైపు వెళ్లకుండా జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తున్నా కూడా కొందరు పట్టించుకోకపోవడంతో ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



# పోగొట్టుకున్న ఫోన్లు అందజేత

## 98 శాతం ఫోన్లు రికవరీ

**ప్రజాపక్షం/పాపన్నపేట :** పోగొట్టుకున్న ఫోన్లను పాపన్నపేట పోలీసులు 98 శాతం రికవరీ చేసి బాధితులకు అప్పగించి శభాష్ అని పించుకుంటున్నారు. జిల్లాలోని రికవరీలో పాపన్నపేట పోలీసులు ముందు ఉండడం విశేషం, స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్సై శ్రీనివాస్ గౌడ్ పర్యవేక్షణలో సిఈఐఆర్ ఇంచార్జ్ పోలీస్ నాన్ సింగ్ ఆధ్వర్యంలో ఫోన్లను చాకచక్యంగా పట్టుకుంటున్నారు. ఇటీవల వివిధ ప్రాంతాలలో పోగొట్టుకున్న 11 సెల్ ఫోన్లు సీఈఐఆర్ వెబ్ సైట్ ద్వారా రికవరీ చేసి, మంగళవారం ఠాణాలో బాధితులకు ఫోన్లు అందజేశారు. సీఈఐఆర్ ద్వారా ఇప్పటి వరకు పోలీస్ స్టేషన్ పరిధిలో 509 ఫోన్లు రికవరీ చేసినట్లు పేర్కొన్నారు. పోలీసు సిబ్బంది, తదితరులున్నారు.

# బాల్య వివాహాల నిర్మూలనపై మానవహారం

**ప్రజాపక్షం/శివ్వంపేట :** మండల కేంద్రమైన శివ్వంపేటలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మంగళవాం బాల్య వివాహాల నిర్మూలనపై మండల అధికారులు, విద్యార్థులతో కలసి మానవహారం నిర్వహించి ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్య వివాహాలతో కలిగే అనార్థాలు, ఇబ్బందులను అర్థమయ్యేలా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మధుకర్ రెడ్డి, డాక్టర్ సాయిసౌమ్య, ఎంపీడీఓ వెంకటలక్ష్మమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ఐకేపీ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# తాగునీటి ఎద్దడి లేకుండా కట్టుదిట్టమైన చర్యలు

## కలెక్టర్ ప్రతీక్ జైన్




**ప్రజాపక్షం/సంగారెడ్డి :** వేసవి సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని ఎక్కడా తాగునీటి కొరత తలెత్తకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ .జైన్ అధికారులను ఆదేశించారు. ప్రతి నివాస ప్రాంతానికి నిరంతరం త్రాగునీటి సరపరా జరిగేలా ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని సూచించారు. మంగళవారం నారాయణఖేడ్ నియోజకవర్గ పరిదిలోని మండలాల ఎంపిడిఒలు ,హౌసింగ్ ఆర్‌డబ్ల్యూల ఎస్ఏలు ఎంపిఓలు మున్సిపల్ కమీషనర్ విద్యుత్ తదితర శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంచినీటి సరఫరా, ఇందిరమ్మ, ఇండ్లు, శానిటేషన్, సాదాబైనామాలు, భూ భారతి దరఖాస్తుల పరిష్కారం వంటి అంశాలపై వివరింగా చర్చించారు. మండలాల వారీగా గ్రామాల్లో నీటి సరపరా పరిస్థితి అందుబాటులో ఉన్న నీటి వనరులు మరమ్మతులు అవసరమైన పనులపై కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. గత వేసవి లో సమస్యల ఎదురైన ప్రాంతాలను గుర్తించి ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. చుక్క నీరు కూడా వృధా కాకుండా సమర్థవంతంగా వినియోగించుకోవాలని ప్రతి ఇంటికి త్రాగునీరు, అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎక్కడైనా సమస్యలు తెలెత్తితే ముందుగానే ఉన్నతాధికారులు దృష్టికి తీసుకు వచ్చి యుద్ధ ప్రాతిపాదకను పరిష్కరించాలని సూచించారు . ఈ సమావేశంలో నారాయణఖేడ్, సబ్ కలెక్టర్ ఉమా హారతి ,మున్సిపల్ కమీషనర్ , ఎంపిడిఓలు తహసీల్దార్లు, ఎంపిఓలు, విద్యుత్ హౌసింగ్ మిషన్ భగీరథ, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం

## మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ మోహన్



**ప్రజాపక్షం/గజ్వేల్ :** రైతుల అభ్యున్నతిని దృష్టిలో పెట్టుకొని పండించిన పంటలను ప్రభుత్వం కొనుగోలు చేస్తుండగా, వరి ధాన్యాన్ని చివరి గింజ వరకు సేకరిస్తామని వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ మోహన్ స్పష్టం చేశారు. మంగళవారం వర్గల్ మండల కేంద్రంలో సర్పంచ్ జయభారతి, పిఎసిఎస్ ప్రత్యేక అధికారి శ్రీనివాస్ రెడ్డి, సీఈఓ జితేందర్ రెడ్డి, ఉప సర్పంచ్ గోవర్ధన్ రెడ్డితో కలసి ఆమె ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అయితే వరి ధాన్యాన్ని నిబంధనలతోపాటు ఆరబెట్టుకొని కొనుగోలు కేంద్రాలకు తేవాలని సూచించారు. ముఖ్యంగా ఈదురు గాలులు, వడగండ్లతో కూడిన వర్షం పడే అవకాశం ఉన్నందున అన్నదాతలు తగు జాగ్రత్త తీసుకోవాలని కోరారు. అవసరమైన ప్రతిచోట ప్రభుత్వం దాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తుండగా, వాటిని అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే సన్నధాన్యానికి ప్రభుత్వం రూ. 500 బోనస్ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. మధ్య దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి రైతులు ఆర్థికంగా ప్రయోజనం పొందాలని వివరించారు. యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, బిఆర్ఎస్ యువజన విభాగం జిల్లా అధ్యక్షులు నాగరాజు, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, వార్డ్ మెంబర్లు, నేతలు పొన్నాల నర్సారెడ్డి, అరవింద్ రెడ్డి, పాషా, పరశురాం, పాల్గొన్నారు.

# చెత్త సేకరణ వాహనాలు మరమ్మతులు చేయాలి

## పిసిసి కార్యదర్శి నాయిని యాదగిరి డిమాండ్



**ప్రజాపక్షం/గజ్వేల్ :** మున్సిపల్ పరిధిలో నిరుపయోగంగా ఉన్న చెత్త సేకరణ వాహనాలను వెంటనే మరమ్మతు చేయాలని పిసిసి కార్యదర్శి యాదగిరి డిమాండ్ చేశారు. మంగళవారం పలువురు కౌన్సిలర్లు, నేతలతో కలిసి ఆయన వాటిని పరిశీలించి మాట్లాడారు. మున్సిపల్‌పై భారం పడకుండా యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని కోరారు. చెత్త సేకరణలో డబ్బులు వసూలు చేస్తే పాలక మండలి నవ్వుల పాలు అవుతుందని స్పష్టం చేశారు. ఇప్పటికే ఆర్థిక భారంతో ఇబ్బంది పడుతున్న గజ్వేల్ మున్సిపల్ యంత్రాంగం ఖర్చులు తగ్గించి ప్రజలపై భారం మోపకుండా వనరులు సమకూర్చుకోవాలని తెలిపారు. చిన్నచిన్న మరమ్మతులు చేపట్టకుండా వాహనాలను పక్కన పడేస్తే తుప్పు పట్టే ప్రమాదం ఉందని, దీనిని దృష్టిలో పెట్టుకుని వాటి మరమ్మతులు చేపట్టి అందుబాటులోకి తేవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు అత్తెల్లి శ్రీనివాస్, మామిడి శ్రీధర్, కాముని మురళి, రొట్టెల శ్రీనివాస్, నేతలు మన్నె వెంకటేశం, నక్క రాములు గౌడ్, గుంటుకు శ్రీనివాస్ పాల్గొన్నారు.

# బాల్యవివాహాలు నిర్మూలిద్దాం

## డిఆర్డీఎ పీడీ శ్రీనివాసరావు



**ప్రజాపక్షం/నర్సాపూర్ :** బాల్య వివాహాలను నిర్మూలించాలని డీఆర్డిఏ పీడీ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మంగళవారం నాడు నర్సాపూర్ పట్టణంలోని చిల్డ్రన్స్ పార్క్ లో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా బాలల భద్రత వారోత్సవాల కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది. మానవహారం చేపట్టి బాల్య వివాహం బతుకు ఆగం మొదలగు స్లోగన్స్ చెప్పించడం జరిగింది. అనంతరం బాల్యవివాహాల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. ఆ తర్వాత నర్సాపూర్ రైతు వేదిక నందు బాలల భద్రత కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం సిఐ జాన్ రెడ్డి మాట్లాడుతూ డ్రగ్స్ కు యువత దూరంగా ఉండాలని సూచించారు అలాగే ట్రాఫిక్ రూల్స్ పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ లక్ష్మి రాజు యాదవ్, సిఐ జాన్ రెడ్డి, ఎంపీడీవో మహమ్మద్ మొజాం హుస్సేన్, ఎస్సై రంజిత్ రెడ్డి, మెడికల్ ఆఫీసర్ రఘువరన్, ఎంఈఓ తారా సింగ్, ఏపిఎం సంగమేశ్వర్, కౌన్సిలర్లు, సూపర్వైజర్లు శివకుమారి, సంతోషి మాత, మెహత, మెప్మా సిబ్బంది, డ్వాక్రా గ్రూపు సీసీలు, కిశోర బాలికలు, ఆశా వర్కర్లు, అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.



# కో-అప్షన్ సభ్యుల ఎన్నిక ప్రశాంతం

**ప్రజాపక్షం/దుబ్బాక :** దుబ్బాక మున్సిపాలిటీ కో ఆప్షన్ సభ్యుల ఎన్నిక మంగళవారం ప్రశాంతంగా జరిగింది. మున్సిపాలిటీ చైర్ పర్సన్ సంగీత అధ్యక్షతన జరిగిన ప్రత్యేక సమావేశంలో నలుగురిని కో ఆప్షన్‌సభ్యులను ఎన్నిక నిర్వహించారు. ఈ ఎన్నికలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు. పరిపాలన అనుభవం కోటాలో గోనెపల్లి దేవలక్ష్మి ఆస యాదయ్య, మైనారిటీ కోటాలో ఎండి. ఖలీల్, ఎండి నసీం సభ్యులుగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన వారు చైర్‌పర్సన్ ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నూతన సభ్యులకు శాలువ కప్పి సన్మానించారు. ప్రజలకు అందుబాటులో ఉండి మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ సులోచన స్వామి తదితరులు ఉన్నారు.

# రాజక్కపేట అంగన్‌వాడీ ముందు ధర్నా

**ప్రజాపక్షం/దుబ్బాక :** దుబ్బాక మండలం రాజక్కపేట గ్రామంలో అంగన్‌వాడీ సెంటర్ 1 వద్ద తల్లిదండ్రులు, గ్రామస్తులు పిల్లలతో కలిసి ధర్నా చేపట్టారు. ఇటీవల కుళ్లిపోయిన కోడి గుడ్లు తిని పిల్లలు అనారోగ్యానికి గురైన ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సిడిపివో ఎల్లయ్య ఆధ్వర్యంలో అధికారులు తనిఖీ చేయగా కుళ్లిపోయిన ఆహార పదార్థాలు ఉన్నట్లు గుర్తించి అంగన్‌వాడీ టీచర్, కార్యకర్తకు షోకాజ్ నోటిసులు జారీ చేశారు. కలెక్టర్, జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేసిన సరైన చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహంవ్యక్తం చేస్తూ ధర్నా చేశారు. గ్రామ సర్పంచ్ జోక్యంతో సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామి ఇవ్వడంతో ధర్నా విమరించారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలి : బాలేష్‌గౌడ్

**ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్ :** పేద, బడుగు, బలహీనవర్గాలకు చెందిన విద్యార్థుల ఉన్నత విద్యకు ఉపయోగడే ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఎత్తివేసే కుట్రలకు పాల్పడుతుందని బిజెపి పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంబటి బాలేష్‌గౌడ్ ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ , స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎబివిపి ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న 48 గంటల నిరాహార దీక్షకు బిజెపి పార్టీ పట్టణ అధ్యక్షుడు బాసంగారి వెంకట్ ఆధ్వర్యంలో బిజెపి నాయకులు మంగళవారం సంఘీభావం ప్రకటించారు. ఇప్పటికైనా ప్రభుత్వం రియంబర్స్‌మెంట్,స్కాలర్‌షిప్ బాకాయిలను వెంటనే విడుదల చేయాలని లేని పక్షంలో విద్యార్థులతో కలిసి బిజెపి ఉద్యామాన్ని ఉధృతం చేస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కెమ్మసారం వెంకట్, సునీల్, గందె సంతోష్,యాదగిరి,లక్ష్మారెడ్డి,మహెందర్,ఎబివిపి నాయకులు ఆదిత్య,పవన్,పరుశరాములు, ఫణిందర్ పాల్గోన్నారు.

# ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

**ప్రజాపక్షం/పాపన్నపేట :** మద్యం మత్తులో క్షణికావేశంలో ఉరి వేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని నాగ్సాన్ పల్లి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం వివరాలు గ్రామానికి చెందిన కాగితాల జహంగీర్ (39) ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గత కొన్ని రోజులుగా ప్రతి రోజు మద్యం సేవించి ఇంటికి వస్తున్నాడు. తాగుడుకు బానిస మారడంతో చిన్నపాటి అప్పులు పెరిగి అవి ఎలా తీర్చాలో తెలియక మనస్తాపం చెందుతున్నాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి సమయంలో మద్యం సేవించి ఓ దావత్ లో భోజనం చేసి ఇంటికి వచ్చాడు. రాత్రి ఇంటి బయటే నిద్రించాడు. మంగళవారం ఉదయం పొలం వద్ద ఉన్న ఓ చెట్టుకు తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని అటుగా వెళ్లిన స్థానికులకు కనిపించాడు. స్థానికులు కుటుంబీకులు, పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించి మృతుడి తల్లి షాబేరా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

## లేబర్ కోడ్లు రద్దు చేసేందుకు పోరాటం చేద్దాం



**ప్రజాపక్షం / నల్లబెల్లి :** కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన నాలుగు లేబర్ కోడ్లు రద్దు అయ్యేంతవరకు కార్మికులు పోరాటం కోన సాగిద్దామని ఐఎఫ్‌టియు నర్సంపేట డివిజన్ కార్యదర్శి గొర్రె ప్రదిప్ పిలుపునిచ్చారు . మంగళవారం వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలోని నారక్కపేట గ్రామంలో మేడే పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు . ఈ సందర్భంగా గొర్రె ప్రదిపు మాట్లాడుతూ కార్మికులు రక్త తర్పన చేసి సాధించుకున్న హక్కులను బిజెపి ప్రభుత్వం చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్లను తీసుకువచ్చి హక్కలను కాలరాస్తుందని చెప్పారు . మేడే స్పూర్తితో కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేసేంత వరకు కార్మికులు ఐక్య పోరాటం చెయ్యలన్నారు . ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు నాయకులు మురళి ,మల్లయ్య ,జనార్ధన్ ,కృష్ణంరాజు ,శ్రీధర్ ,మహేష్ తదితరులు పాల్గోన్నారు .

## బాధిత కుటుంబానికి బియ్యం అందజేత

**ప్రజాపక్షం/రాయపర్తి:** మండలంలోని జయరాం తండా(ఎస్) గ్రామానికి చెందిన గుగులోత్ అమ్మి, గుగులోత్ మాజీ, జాటోత్ వాళ్య, గుగులోత్ అమ్రు, గుగులోత్ మంగమ్మ ఇటీవల అనారోగ్య కారణాలతో మరణించగా సోమవారం బాధిత కుటుంబాలను ఎస్ఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి పరామర్శించి ఒక్కో కుటుంబానికి 50 కెజిల బియ్యం, ఆయిల్ క్యాన్‌ను అందజేసి ఆదుకున్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు లేతాకుల రంగారెడ్డి, ఐత రామ్‌చందర్, సంకినేని ఎల్లస్వామి, చిలువేరు సాయి గౌడ్, ఐత జంపి, సాయి కిరణ్, బోయిని అనిల్, సర్పంచ్ గుగులోత్ రమేష్, ఉప సర్పంచ్ గోవింద్, బాధవత్ బాలు, బాధవత్ సుమన్, బాధవత్ బద్రు, తదితరులు పాల్గొన్నారు.



# రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమం

### మండల వ్యవసాయ అధికారి జై సింగ్

**ప్రజాపక్షం /నడికూడ:** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ సహకారంతో "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" అనే కార్యక్రమం ద్వారారైతులకు ఆధునిక వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానం చేరవేయడం, పంటల దిగుబడులు పెంచడం ఉత్తమ వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించడం లక్ష్యంగా పీజేటీఎస్ఏయూ ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ సహకారంతో "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" కార్యక్రమం,ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు గ్రామ స్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు ప్రత్యక్షంగా పరిష్కార మార్గాలు సూచించబడతాయని నడికూడ మండలంలోని వివిధ గ్రామాలలో ఈ క్రింద సూచించిన తేదీలలో 29న రాయపర్తిలో,02న వరికోల్‌లో,05న కంఠాత్మకూర్ లో,08న కౌకొండలో 14న ముస్త్యాలపల్లి లో 16న నార్లాపూర్ లో 20న ధర్మారం లో 22న నడికూడలో రైతు సోదర సోదరీమణులు,ప్రజా ప్రతినిధులు,అనుబంధ శాఖల అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొని శాస్త్రవేత్తల సూచనలను వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నామని మండల వ్యవసాయ శాఖ అధికారి జై సింగ్ తెలిపారు.



## బోనమెత్తిన దొంతి..భక్తి జోష్‌లో కాటమయ్య ఉత్సవాలు

**ప్రజాపక్షం/నెక్కొండ:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఐదు రోజులుగా కొనసాగుతున్న కాటమయ్య ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాలలో భాగంగా సోమవారం రాత్రి నిర్వహించిన బోనాల పండగ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా స్థానిక ఎంఎల్‌ఏ దొంతి మాధవరెడ్డి, టిపిసిసి సభ్యులు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి, భక్తి భావంతో బోనాలు మోసి కాటమయ్యకు బోనాలు సమర్పించారు. సంప్రదాయ వేషాధారణలో బోనమెత్తిన నాయకులు భక్తులతో కలిసి ఊరేగింపులో పాల్గొనడం విశేషం. స్వామివారి కృపతో నియోజకవర్గ ప్రజలు, రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో, సుభిక్షంగా ఉండాలని ఎంఎల్‌ఏ దొంతి మాధవరెడ్డి ప్రార్థించారు. ఉత్సవాలకు భారీ సంఖ్యలో భక్తులు, గౌడ సంఘ మహిళలు, పురుషులు,




చిన్నలు, పెద్దలు, వృద్దులు హాజరై కాటమయ్యను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. విద్యుత్ దీపాల కాంతులతో అలంకరించిన వీధులు, బోనాల ఊరేగింపుతో నెక్కొండ మండల కేంద్రం పండగ వాతావరణాన్ని సంతరించుకుంది. భక్తుల నినాదాలతో ప్రాంతం మార్మోగింది.

## పదవి ఎంత ఎతైనా..వృత్తి గౌరవం అంతకంటే ఎత్తు

### యాకయ్య సందేశం యువతకు మార్గదర్శకం

**ప్రజాపక్షం/నెక్కొండ:** నెక్కొండ మండల కేంద్రంలో గౌడ కులస్థులు నిర్వహిస్తున్న కాటమయ్య ఉత్సవాలు భక్తి శ్రద్ధత నడుమ రసవత్తరంగా కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో టి ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఇదునూరి యాకయ్య పాల్గొని మేక తల మోస్తూ తన వృత్తి పట్ల ఉన్న గౌరవాన్ని కార్యరూపంలో చూపించిన తీరు అందరిని ఆకట్టుకుంది. సాధారణంగా పదవులు పెరిగిన కొద్ది మూలాలు మరవడం జరుగుతుంటే. యాకయ్య మాత్రం తన కులవృత్తిని గర్వంగా నిలబెట్టుకుంటూ సాంప్రదాయాలను కాపాడడం ద్వారా సమాజానికి అరుదైన సందేశం ఇచ్చారు. పుట్టుకతో వచ్చిన వృత్తి చిన్నది కాదు...దానిని గౌరవించడం మన బాధ్యత అనే భావాన్ని ఆయన తన ఆచరణతో స్పష్టంగా తెలిపారు. ఈ సందర్భం చూసిన గ్రామస్తులు, పెద్దలు మాత్రమే కాదు యువత కూడా యాకయ్యను ప్రశంసిస్తూ ఇలాంటి నాయకులు సమాజానికి అవసరమని అభిప్రాయపడ్డారు. కులవృత్తులను తక్కువగా



చూడకుండా వాటిని గౌరవంగా స్వీకరించి ముందుకు సాగాలని ఆయన చూపిన మార్గం రాబోయే తరాలకు ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు. కాటమయ్య ఉత్సవాల సందడి మధ్య యాకయ్య చూపిన ఈ వినమ్రత, వృత్తి గౌరవం కలయిక నెక్కొండలో చర్చనీయాంశంగా మారింది. యువతకు తమ మూలాలను మరువకుండా, సంప్రదాయాలను కాపాడుతూ ఎదగాలనే ప్రేరణనిచ్చే సంఘటనగా ఇది నిలిచింది.

## ఉపాధిహామీ కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ



**ప్రజాపక్షం/వేలేరు :** వేలేరు మండలకేంద్రంలో ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న కార్మికులను వేలేరు గ్రామసర్పంచ్ బిల్ల యాదగిరి మంగళవారం పనిప్రదేశాన్ని సందర్శించి కార్మికులకు వేసవిని దృష్టిలో ఉంచుకొని తగుజాగ్రత్తలు తెలుపుతూ మజ్జిగ ప్యాకెట్లు,ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించారు ఈకార్యక్రమంలో గ్రామపంచాయితీకార్యదర్శి సంపత్‌కుమార్,ఆశాకార్యకర్త బైరి శోభ ఫీల్డ్ అసిస్టెంట్ సూత్రపు సంపత్,ఉపాధీహామీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన బస్ సర్వీస్ ప్రారంభం



**ప్రజాపక్షం / వేలేరు :** హైదరాబాద్ నుండి మల్లికుదుర్ల మీదుగా వేలేరు వరకు నూతన బస్ సర్వీస్‌ను మల్లికుదుర్ల గ్రామసర్పంచ్ జక్కుల మౌనికసంపత్‌యాదవ్ ప్రారంబించారు ఈసంధర్భంగా వారు మాట్లాడుతూ జనగామ డిపో మేనేజర్ స్వాతిని పలుమార్లు కలిసి వేలేరు మండలం మారుమూల ప్రాంతం కాబట్టి ఈప్రాంత ప్రజలు హైదరాబాద్ వెల్లాలంటే ఇబంబదులుగా ఉందని తెలుపగా వెంటనే స్పందించిన డిపో మేనేజర్ నూతన బస్ సర్వీస్‌ను మంజూరు చేయడం జరిగినందున మంగళవారం మల్లికుదుర్ల గ్రామంలో కొబ్బరికాయకొట్టి నూతన బస్ సర్వీస్ ప్రారంబించడం జరిందని మల్లికుదుర్ల గ్రామసర్పంచ్ జక్కుల మౌనికసంపత్‌యాదవ్ తెలిపారు కార్యక్రమంలో డ్రైవర్,కండక్టర్ జుర్రు శ్రీనివాస్,ప్రయాణీకులు తదితరులు పాల్గొన్నారు.

## కన్నుల పండువగా ఎల్లమ్మ తల్లి బోనాలు

**ప్రజాపక్షం/ కమలాపూర్:** కమలాపూర్ మండల కేంద్రంలో గౌడ కులస్థుల ఎల్లమ్మ తల్లి బోనాల పండుగను కన్నుల పండుగల ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గౌడ సంఘ పెద్దలు స్థానిక పనగట్ల నుంచి ప్రధాన వీధుల గుండా బోనాలను నెత్తిన పెట్టుకోని మహిళలు ఊరేగింపుగా ఎల్లమ్మ తల్లి ఆలయం వరకు డప్పు చప్పుళ్ళతో భారీ సంఖ్యలో తరలివెళ్ళారు. ఎల్లమ్మ తల్లికి మొక్కులు సమర్పించి భక్తిశ్రద్ధలతో వేడుకున్నారు.

## హనుమాన్ భక్తులకు మహా అన్నదానం



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని నర్సంపేట రోడ్డులోని ఓ సిటి శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయంలో హనుమాన్ దీక్షలో ఉన్న భక్తులకు మహా అన్నదానాన్ని టిపిసిసి కార్యదర్శి మీసాల ప్రకాష్, గంద్రకోట రవి రాణి దంపతుల ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మీసాల ప్రకాష్ మాట్లాడుతూ 41 రోజుల పాటు హనుమాన్ మాల వేసి దీక్షలో ఉంటారని అన్నారు. హనుమాన్ మాలవేసిన భక్తులకు మహా అన్నదానం చేయడం గొప్ప విషయమని అన్నారు. మహా అన్నదానం చేసిన గంద్రకోటి రవి రాణి దంపతులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు చింతలపాటి శ్రీనివాస శర్మ, చింతలపాటి శేషకుమార్ శర్మల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. హనుమాన్ మాల వేసుకున్న భక్తులు పెద్దయెత్తున పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ కేంద్రంలో మందుబాబుల వీరంగం

**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని ఓడేడు గ్రామంలోని ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రం ఆకతాయిలకు అడ్డాగా మారింది.అర్ధరాత్రి సమయంలో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో మద్యం సేవించడమే కాకుండా,మద్యం సీసాలను కిటికీల గుండా లోపలికి విసిరి పగలగొట్టారు.

ఈ ఘటనలో అంగన్‌వాడీ కేంద్రం కిటికీలు ధ్వంసమయ్యాయి.ఇలాంటి సంఘటన జరగడం ఇది నాలుగోసారి కావడంతో స్థానికులు,అంగన్‌వాడీ సిబ్బంది తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఈ విషయంపై గ్రామ సర్పంచ్ పోతిపెద్ది కవిత కిషన్ రెడ్డి సూచన మేరకు.. ఉపసర్పంచ్ దాసరి ప్రశాంత్ గౌడ్, గ్రామ కార్యదర్శి బుర్ల రాజేందర్,అంగన్‌వాడీ టీచర్ మధుమతి కలిసి ముత్తారం ఎస్సై రవికుమార్ ని ఆశ్రయించారు. ఫిర్యాదును స్వీకరించిన ఎస్సై సానుకూలంగా స్పందించారు.ముఖ్యంగా ఆకతాయిల పట్ల ప్రత్యేక చొరవ తీసుకొని వారికి కౌన్సిలింగ్ నిర్వహిస్తామని,ఒకవేళ ఇలాంటి సంఘటనలు మళ్లీ పునరావృతమైతే కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై రవికుమార్ హెచ్చరించారు. చిన్నారులు విద్యనభ్యసించే అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడటంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



## రైల్వే గేటు మూసివేతతో ప్రజల రాకపోకలకు ఇబ్బంది

### మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్

**ప్రజాపక్షం/జమ్మికుంట:** జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలో రైల్వే రోడ్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణంకు రైల్వే గేట్ మూసివేయడానికి తీర్మానం సమర్పించగా ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మెన్ మొలగు ప్రశాంత్ కుమార్, పాలకవర్గం ఆమోదించారు. మంగళవారం మున్సిపల్ చైర్మెన్ మొలగు ప్రశాంత్ కుమార్ అధ్యక్షతన మున్సిపల్ కార్యాలయం లో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మెన్ మాట్లాడుతూ భారతీయ రైల్వే సాధారణ నియమాలను అనుసరించి లెవెల్ క్రాసింగ్ లను తొలగించి రద్దీ నియాత్రణ చేయు లక్ష్యంతో సౌత్ సెంట్రల్ రైల్వే జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని మడిపల్లి క్రాస్ రైల్వే లెవల్ క్రాసింగ్ గేట్ రోడ్డు ఓవర్ బ్రిడ్జి నిర్మాణంను చేయుటకు గేటు మూసివేయడానికి కౌన్సిల్ సభ్యులు ముందు తీర్మాణం సమర్పించగా ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ పనులు పూర్తి చేసిన పిదప మాత్రమే రైల్వే లెవెల్ క్రాసింగ్ గేటును మూసివేయుటకు మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించిన్నట్లు చైర్మెన్ ప్రశాంత్ కుమార్ తెలిపారు. ఇట్టి ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించిన వివరాలు సెంట్రల్ రైల్వే జోన్ ఖాజీపేట వారికి డిపీఆర్, ఇతర వివరాలు మున్సిపల్ కార్యాలయంలో అందించాలని కోరినట్లు ఆయన తెలిపారు.మేనేజర్ జి.రాజిరెడ్డి, టిపివో శ్రీధర్, సీనియర్ అసిస్టెంట్ వాణీలతో పాటు పలువురు పాల్గొన్నారు.

## దాడికి పాల్పడ్డ వ్యక్తిని శిక్షించాలి

**ప్రజాపక్షం/జమ్మికుంట:** జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలో మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ ఆదేశాల మేరకు మున్సిపల్ మేనేజర్ రాజిరెడ్డి ఆధ్వర్యంలో దాడికి పాల్పడ్డ వ్యక్తిని శిక్షించాలని నిరసిస్తూ మంగళవారం నల్ల బ్యాడ్జిలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మేనేజర్ రాజిరెడ్డి మాట్లాడుతూ కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలో మున్సిపల్ కార్పొరేటర్ భర్త మున్సిపల్ సానిటరీ ఇన్స్పెక్టర్ పై దాడి చేయడం జరిగిందని నిరసన తెలుపడం జరిగిందన్నారు. దాడి చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని మున్సిపల్ ఉద్యోగులకు కనీస భద్రత కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ వాణి, భాస్కర్, శ్రీనివాస్, వార్డ్ ఆఫీసర్లు పలువులు పాల్గొన్నారు.



## హ్యాండ్లూమ్ టెక్నాలజీ 2026–27 అడ్మిషన్లపై అవగాహన

**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** కొత్తవాడలోని పద్మశాలి వెల్ఫేర్ టెస్ట్ భవన్‌లో మంగళవారం ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హైండ్లూమ్ టెక్నాలజీ ఐఐ హెచ్‌టి కళాశాలలో మూడవ సంవత్సర అడ్మిషన్ల కొరకు అవగాహన సదస్సు చేనేత, ఔళి శాఖ సహాయ సంచాలకులు శ్రీకాంత రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ సదస్సుకు ముఖ్య అతిధులుగా హైదరాబాద్ ఐఐఎస్‌టి టెక్స్‌టైల్స్ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపాల్, ఓఎస్టి వి హిమజ కుమార్, టిపిసిసి చేనేత విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్ప వెంకటేశ్వర్లు నేత పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గతంలో హ్యాండ్లూమ్ టెక్నాలజీ కోర్సుల్లో చేరాలంటే తమిళనాడులోని సేలం, ఆంధ్రలోని వెంకటగిరి ప్రాంతాలలో అడ్మిషన్లు ఉండేవని అక్కడ సీట్లు తక్కువ కాంపిటిషన్ ఎక్కువగా ఉండడం మూలంగా తెలంగాణ పిల్లలకు సీట్లు రాక అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆయన గుర్తు చేశారు. తెలంగాణలో ఇన్స్టిట్యూట్‌ను ఏర్పాటు చేయాలని గత ప్రభుత్వానికి వినతులు ఇచ్చినప్పటికి పెడచెవిన పెట్టిందన్నారు. మంత్రి కొండా సురేఖ ద్వారా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వినతుల ఇవ్వగా కేంద్ర ప్రభుత్వం ద్వారా అనుమతులు తీసుకొచ్చి హైదరాబాద్‌లోని శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయంలో 60 సీట్లతో చేనేత, టెక్స్‌టైల్ టెక్నాలజీ డిప్లమా కోర్సును ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ఎంపిక కోసం పదవ తరగతి పరీక్ష పాసై ఉండాలని, జులై నెల ఒకటవ తేదీ నాటికి బిసి, జనరల్ కేటగిరి పిల్లలు గరిష్ట వయోపరిమితి 23 సంవత్సరాలు, షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగల వారికి గరిష్ట వయో పరిమితి 25 సంవత్సరాలు ఉండాలన్నారు. అనంతరం చేనేత, ఔళి శాఖ సహాయ సంచాలకులు శ్రీకాంత్ రెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ మార్కెటింగ్ ఆఫీసర్ బొట్టు వెంకటేశ్వర్లు, డెవలప్‌మెంట్ ఆఫీసర్ సోమ సుదీర్, యెలుగం చిన్న కొమురయ్య, సహకార సంఘాల అధ్యక్షులు పంతగాని శ్రీనివాస్, యెలుగం రవిరాజ్, కొలిపాక మదనయ్య, చిన్న భద్రయ్య, రాజేందర్, అడిగొప్పుల సంపత్, యెలుగం సాంబయ్య, సంపత్, కుమారస్వామి, శంకరలింగం, దాసరి రాజశేఖర్, బొగ్గుల సుప్రియ, చిలుక శ్రీధర్, మాటేటి రాములు, పాల్గొన్నారు.



## వరిలో రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి

**ప్రజాపక్షం/రాయపర్తి :** మండలంలోని గన్నారం గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త డాక్టర్ పి గోన్యా నాయక్ మాట్లాడుతూ మార్కెట్‌లో 2005 కాస్టో ఆర్ఎన్ఆర్ 15048, డబ్లూఈఎల్ 44, డబ్ల్యూఈఎల్ 962, కెఎన్ఎం 1638, బిపిటి 5204, జెజిఎల్ 1798 650వ వంటి విత్తనాలు వానాకాలంలో సాగు చేసి బోనస్ పొందవచ్చని అన్నారు. వరి పంటలో రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలని అన్నారు. నీటి ఆదా, యూరియా వాడకం అవసరం మేరకు రసాయనాల వాడకం గురించి క్లుప్తంగా వివరించారు. వరి, మొక్కజొన్న పంటలు కోసిన తర్వాత పంట అవశేషాలను కాల్చడం పంట వ్యర్థాల్లో ఉండే కర్బణం కార్బండియాక్సైడ్ రూపంలో వాతావరణంలో చేరి విషనోగ్రతను పెంచడమే కాకుండా వాతావరణం కాలుష్యం ఏర్పడుతుందని అన్నారు. పొలంలో నేరుగా కలియదున్నితే అవి కుళ్ళి సేంద్రియ ఎరువుగా మారి పంటలకు అందజేస్తుంది. ఒక ఎకరానికి 50 కెజిల సింగిల్ సూపర్ ఫాస్పేట్ వేసుకొని కొయ్యలను కలియదున్నినట్లు అయితే వాతావరణం కాలుష్యం జరగకుండా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి వీరభద్రం, సర్పంచ్ గడ్డం విజయ సమ్మయ్య, వ్యవసాయ విస్తరణ అధికారి కావ్య, పంచాయతీ కార్యదర్శి కరుణ శ్రీ, మేడ సుధాకర్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



## సంక్షేమ పథకాల ప్రచారంలో సమాచార శాఖను తీర్చిదిద్దాం



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరాలంటే సమాచార పౌర సంబంధాల శాఖ తన ప్రచార శైలిని మరింత ఆధునీకరించుకోవాలని తెలంగాణ రాష్ట్ర జర్నలిస్టుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నారగౌని పురుషోత్తం అన్నారు. ఐఅండ్ పిఆర్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ముకుంద రెడ్డిని మంగళవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో టిఎస్‌జేయూ ప్రతినిధి బృందం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నారగౌని పురుషోత్తం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వినూత్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళడంలో సమాచార శాఖది కీలక పాత్ర అని నొక్కి చెప్పారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికతను జోడించి, ప్రచార విభాగాలను బలోపేతం చేయడం ద్వారా పథకాల లబ్ధిని ప్రజలకు మరింత చేరువ చేయవచ్చని ఆయన ఆకాంక్షించారు. అనుభవజ్ఞులైన ముకుంద రెడ్డి నేతృత్వంలో శాఖ కొత్త పుంతలు తొక్కుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. అదేవిధంగా జర్నలిస్టుల సంక్షేమం, వృత్తిపరమైన సమస్యల పరిష్కారంపై కూడా కమిషనర్ సానుకూలంగా స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిఎస్‌జేయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు ముత్యం ముఖేష్ గౌడ్, తదితరులు పాల్గొని ఘనంగా సన్మానించారు.

## ఎఐఎస్ఎఫ్ నేత ముందస్తు అరెస్టు




**ప్రజాపక్షం / వరంగల్ :** పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంటు స్కాలర్‌షిపులను వెంటనే విడదల చేయ్యాలని డిమాండ్ చేస్తు ముఖ్యమంత్రి ఇంటికి పాదయాత్ర వెళ్లకుండా ఎఐఎస్ఎఫ్ వరంగల్ జిల్లా కార్యదర్శి శరత్‌ను గీసుగొండ పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు . మంగళవారం శరత్ అరెస్టు గీసుగొండ పోలీసుస్టేషన్ తరలించారు .

## హెల్త్ సెంటర్ నిర్మాణ పనుల ప్రారంభం



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** కరీమాబాద్ ఎస్ఆర్ఆర్ తోట 32వ డివిజన్‌లో నూతన అర్బర్ హెల్త్ సెంటర్ భవన నిర్మాణ పనులు ప్రారంభంలో భాగంగా బోరు పనులను కార్పొరేటర్ పల్లం పద్మ రవి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో తీసుకు రావాల్సిందిగా కాంట్రాక్టర్‌ను కోరారు.

## అన్నదాతను ఆదుకోమంటే అక్రమ అరెస్టులేందీ?

### రైతుల, బిఆర్ఎస్ నాయకులతో చొప్పదండిలో ధర్నా

**ప్రజాపక్షం/చొప్పదండి:** ధాన్యం కాంటాకు తంటాలేంటని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, రైతులు స్థానిక బిఆర్ఎస్ నాయకులతో కలిసి చొప్పదండ పట్టణంలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద రోడ్డుపై బైఠాయించి ధర్నాకు దిగారు. పోలీసులు రైతులను, బిఆర్ఎస్ నాయకులను అరెస్టు చేశారు. ఈ సంధర్భంగా రవిశంకర్ మాట్లాడుతూ ధాన్యం లిస్టంగ్‌కు, ఆన్‌లైన్ ట్రకోట్లు, జిపిఎస్ నిబంధనను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. వడ్ల కొనుగోలులో ప్రభుత్వం నిబంధన జిపిఎస్, ఆన్‌లైన్ ట్రక్ట్ పేరుతో అనేకమైన ఇబ్బందులు వస్తాయన్నారు. జిపిఎస్, ఆన్‌లైన్ ట్రక్ట్ రవాణాకు తప్పనిసరి చేస్తే ట్రాక్టర్‌కు.4 వేల వరకు రైతులకు అదనపు భారం పడుతుందన్నారు. ఈ పద్దతిలో ఒక్కో కేంద్రంలో వడ్లు ఎత్తేందుకు 2 నెలల సమయం పట్టి , అకాల వర్షాలు పడితే అన్నదాతల గతి ఏమిటని ఆందోళన వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోళ్లలో కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యంతో ఇప్పటికే అన్నదాతలకు శాపంలా మారిందని, కొనుగోలు కేంద్రాల పరిధిలో నేటి నుంచి అమల్లోకి వచ్చే కొత్త నిబంధనలు రైతుల పాలిట శరాఘాతంగా మారే ప్రమాదముందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల నుంచి విముఖత వ్యక్తమవుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎందుకు పెడచెవిన పెడుతున్నాయని ప్రశ్నించారు. వడ్ల కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు ట్రాన్స్ పోర్టు చేసే వాహనాలకు జిపిఎస్ విధానం ఏర్పాటు చేయాలనే నిబంధనను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే కొనుగోలు కేంద్రాల వద్ద వివిధ కారణాల వల్ల కొనుగోళ్లు మందకొడిగా సాగుతున్నాయని, ఈ పరిస్థితుల్లో కొత్త నిబంధనలు పెట్టడం వల్ల రైతులకు ఇబ్బందులు కలిగే అవకాశాలున్నాయన్నారు. కెసిఆర్ ప్రవేశపెట్టిన పాత నిబంధన ప్రకారమే వర్షాలు రాకముందే కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతం చేసి అన్నదాతలను ఆదుకోవాలని, లేని పక్షంలో రైతుల పక్షాన ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.



## ఏకశిలా పరపతి సంఘ భవనంకు తాళం

**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** ఏకశిలా పరపతి సంఘ భవనానికి తాళం వేసిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే సంఘ ఎన్నికలలో నూతన కమిటీ ఎన్నిక కావడం జరిగింది. వారు సంఘ భవనానికి వెళ్ళిన క్రమంలో భవనానికి తాళం వేసి ఉండడంతో కమిటీ సభ్యులు మిల్స్ కాలనీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సంఘం కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఏకశిలా పరపతి సంఘం భవనంలో జరిగిన మహా సభలో బ్యాలెన్స్ షీట్ ప్రవేశ పెట్టగా ఆమోదం పొందిన తర్వాత పాత కమిటీని రద్దు చేసిన తర్వాత సంఘ సభ్యుల అభిప్రాయంతో నూతన కమిటీని ఎన్నికల అధికారి ఎనబోతుల విజయ్‌కుమార్, అడ్వకేట్ దీకొండ నరసింహారావు, కన్న శ్రీనివాసరావు, టీచర్ బాసిట్టి వెంకటేశ్వర్ల, టీచర్ నామినేషన్స్ స్వీకరించి నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. వారు స్పెషల్ లోన్ రూపేనా వాడుకున్న డబ్బులు చెల్లించకుండా లెక్కలు చెప్పకుండా సంఘం భవనానికి తాళాలు వేసుకొని బెదిరింపులకు పాల్పడడంతో మిల్స్ కాలనీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఇప్పటికైనా కొత్త కమిటీ వారికి సహకరించి సంఘం తాళాలు డబ్బులు లావా



## ధాన్యం కొనుగోళ్లు వెంటనే వేగవంతం చేయాలి



ప్రజాపక్షం/జఫర్‌గఢ్: వరిధాన్యం, మొక్క జొన్న కొనుగోళ్లు వెంటనే వేగవంతం చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రావర్తి సోమయ్య అన్నారు. మంగళవారం ఐకేపీ, పీఏసీఎస్ ధాన్యం, మక్క జొన్న, జొన్న కొనుగోలు కేంద్రాలను వారు సందర్శించారు. వరిధాన్యం, మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియలో తీవ్ర అవస్థలు నెలకొన్నాయని, రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పారదర్శకంగా కొనుగోలు జరగాలని, రైతులకు తగిన మద్దతు ధరలు, న్యాయం జరగాలన్నారు.వెంటనే పరిష్కరించకపోతే తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని సోమయ్య హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సఖి నర్సింగ్, ఎండీ ఖాదర్, చిరంజీవి, రమ, లక్ష్మి , విమల, సరోజ, నరేష్, పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య సంఘం నేత మృతి



ప్రజాపక్షం/జఫర్‌గఢ్: ప్రముఖ రైస్ మిల్లర్, జిల్లా ఆర్యవైశ్య సంఘం సలహాదారులు గందె సీతారాములు (74) అనారోగ్య కారణాలతో మంగళవారం మృతిచెందారు. మండల కేంద్ర శివారు వడ్డేగూడెంకు చెందిన సీతారాములు గత కొద్ది రోజులుగా అనారోగ్యానికి గురై చికిత్స పొందుతూ మృతిచెందడం జరిగింది. దీంతో జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గంగిశెట్టి ప్రమోద్ కుమార్, చిట్టిమళ్ల కృష్ణమూర్తి, మండల ఆర్యవైశ్య సంఘం నేతలు అంచూరి యుగంధర్, దాంశెట్టి సోమన్న,అశోక్, బోనగిరి శ్రవణ్‌కుమార్, రేవూరి శ్రీనివాస్, రేవూరి రమేష్, వివిధ పార్టీల నేతలు సీతారాములు మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

## ద్విచక్ర వాహనంలో మంటలు అప్రమత్తతో తప్పిన ప్రమాదం

ప్రజాపక్షం / జనగామ : జనగామ పట్టణంలోని గణేష్ వాడ ఏరియాలో మంగళవారం ఉదయం ద్విచక్ర వాహనంలో మంటలు చెలరేగాయి. వాహన యజమానితో పాటు స్థానికులు అప్రమత్తమై అగ్నిమాపక వాహనం ద్వారా మంటలు ఆర్పడంతో పెనుప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళ్తే జనగామ మండలంలోని పడమటి గూడెం ప్రాంతానికి చెంది ఓ రైతులు జనగామలో పాలు విక్రయిస్తారు. ఎప్పటిలాగే మంగళవారం ఉదయం పాలు తీసుకురాగా వాహనంలో నుండి మంటలు చెలరేగాయి. నీటితో మంటలు ఆర్పేందుకు పయత్నిస్తుండడంతో మంటలు ఎక్కువగా వ్యాపించడంతో ఫైర్ స్టేషన్‌కు ఫోన్ చేశారు. స్పందించిన ఫైర్ సిబ్బంది వెంటనే అక్కడకు చేరుకొని మంటల్ని ఆర్పారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. షార్ట్ సర్క్యూట్ ద్వారానే ఈ ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా విచారించారు.

# ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి



ప్రజాపక్షం, తొర్రూరు : ప్రపంచ కార్మిక దినోత్సవ వేడుకలను గ్రామ గ్రామాన ఘనంగా నిర్వహించాలని సీఐటీయూ మండల కార్యదర్శి జమ్ముల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షులు పల్లెల వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన అన్ని రంగాల కార్మికుల సమావేశంలో జమ్ముల శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు కావస్తున్నా నేటికి సంక్షేమ బోర్డు ఊసే ఎత్తడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నరేంద్రమోడీ ప్రభుత్వానికి ప్రపంచ కార్మిక దినోత్సవం నుంచి మేడే అమరవీరుల స్ఫూర్తితో నూతన లేబర్ కోడ్ చట్టాలను రద్దు చేసేంత వరకు విడతల వారిగా ఉద్యమాలకు సిద్ధం కావాలన్నారు. ఈ సమావేశంలో భవన నిర్మాణ కార్మిక సంఘం మండల ఉపాధ్యక్షులు మారిపెల్లి నాగన్న, కోశాధికారి ఈసంపల్లి యాకన్న, పెయింటర్స్ వర్కర్స్ యూనియన్ తొర్రూరు మండల కార్యదర్శి మంగళపల్లి శోభన్, డ్రిల్లింగ్ మిషన్ యూనియన్ మండల అధ్యక్షులు సూర యాకన్న, కార్మికులు బావ్‌సింగ్, తిమ్మిడి రవి, జి.చిన్నబాబు, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి



ప్రజాపక్షం/మహబూబాబాద్: తెలంగాణలో ఉద్యోగ, ఉపాధ్యాయుల డిమాండ్ల జాయింట్ యాక్షన్ యొక్క రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు జిల్లా కేంద్రంలో ఒక్కరోజు నిరసన కార్యక్రమం నిర్వహించాలని తలపెట్టింది. ఈ కార్యక్రమంలో భాగంగా రెండవ దశ నిరసన కార్యక్రమాన్ని చేపట్టడం కోసం మంగళవారం మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్‌కి మే 5న నిరాహార దీక్ష కార్యక్రమానికి అనుమతి కోసం జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ వడ్డెబోయిన శ్రీనివాస్, సెక్రెటరీ జనరల్ మహమ్మద్ రఫీ గారి ఆధ్వర్యంలో కమిటీవినతి పత్రం అందజేశారు. పిఆర్సి, పెండింగ్ డిఏ బకాయిలను వెంటనే చెల్లించాలని, సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని, హెల్త్ కార్డులను వెంటనే మంజూరు చేయాలని, 13వేల కోట్ల ఉద్యోగ మరియు పెన్షనర్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. మే5న నిరసన కార్యక్రమంలో ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయగలరని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పి ఆర్ టి యు ప్రధాన జిల్లా ప్రధాన కార్యదర్శి చాగర్లమూడి శ్రీధర్, ఎస్టియు జిల్లా అధ్యక్షులు గన్నోజు ప్రసాద్, టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు బాలాస్టి రమేష్ , ఏ ఐ ఎఫ్ టి ఓ జాతీయ ఉపాధ్యక్షురాలు శ్రీమతి గీత, పి ఆర్ టి యు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు హళ్యా నాయక్, తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఆవునూరి రవి, జిల్లా కోశాధికారి కొప్పుల నాగరాజు, టీఎన్జీవో కోశాధికారి మైసరోహిత్, వైస్ ప్రెసిడెంట్ రంజిత్, టీజీవో నాయకులు సోమ్లానాయక్ తదితరులు పాల్గొన్నారు.

# సమ్మర్ కోచింగ్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలి

### జీఎం ఏనుగు రాజేశ్వర్ రెడ్డి



ప్రజాపక్షం/భూపాలపల్లి : సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ భూపాలపల్లి ఏరియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత సమ్మర్ కోచింగ్ క్యాంప్‌ను సింగరేణి ఉద్యోగుల పిల్లలు, పరిసర ప్రాంతాల చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని భూపాలపల్లి ఏరియా జీఎం ఏనుగు రాజేశ్వర్ రెడ్డి సూచించారు. మంగళవారం భూపాలపల్లి ఏరియాలో వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, చిన్నారులు వేసవి సెలవులను వినియోగించుకుని క్రీడల్లో నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడం ద్వారా శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. క్రీడలు కేవలం వినోదానికి మాత్రమే కాకుండా, క్రమశిక్షణ, జట్టు భావన, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఆయన తెలిపారు. ఈ ఉచిత సమ్మర్ కోచింగ్ క్యాంప్‌లో అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, వాలీబాల్ తదితర క్రీడలలో నిపుణుల ద్వారా శిక్షణ అందించబడుతుందని తెలిపారు. సింగరేణి ఉద్యోగుల పిల్లలతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన 18 సంవత్సరాల లోపు బాలబాలికలు ఈ శిక్షణలో పాల్గొనే అవకాశం కల్పించబడిందన్నారు. ఈనెల 28 నుండి మే 22 వరకు నిర్వహించబడనున్న ఈ శిక్షణ శిబిరం ప్రతిరోజూ ఉదయం 6 గంటల నుండి 8 గంటల వరకు, సాయంత్రం 5.30 గంటల నుండి 7 గంటల వరకు కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఇన్చార్జ్ పర్సనల్ మేనేజర్ కావూరి మారుతి, గుర్తింపు సంఘం ఏఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి మోట పలుకుల రమేష్, ఐఎన్‌టియుసి బ్రాంచ్ నాయకులు హుస్సేన్, సిఎంఓఏఐ ప్రెసిడెంట్ నజీర్, క్రీడల గౌరవ కార్యదర్శి శ్రావణ్ కుమార్, స్పోర్ట్స్ సూపర్వైజర్ పర్స శ్రీనివాస్, కోఆర్డినేటర్ పాక దేవయ్య, తదితరులు పాల్గొన్నారు.

# భూపాలపల్లి మెడికల్ కాలేజీలో షీ టీమ్ భరోసా అవగాహన

ప్రజాపక్షం/భూపాలపల్లి : ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఆదేశాల మేరకు భూపాలపల్లి జిల్లా మెడికల్ కాలేజీలో జిల్లా షీ టీమ్ భరోసా ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సుమారు 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు. మహిళల భద్రత, లింగ సమానత్వం, బాల రక్షణ, మహిళలపై వివక్ష, లింగ వివక్ష, హింసాత్మక చర్యలు, సైబర్ నేరాలు తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100, 112, 1930, 1098 నంబర్లను సంప్రదించాలని, సమస్యలు ఎదురైనప్పుడు భూపాలపల్లి షీ టీమ్‌ను 87126 58162 నంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు. మహిళలు, పిల్లల భద్రత కోసం షీ టీమ్ సేవలను వినియోగించుకోవాలని షి టీం ఎస్ఐ మహ్మద్ ఫజల్ ఖాన్, భరోసా ఎస్ఐ స్వప్న కుమారి సూచించారు. ప్రజల్లో భద్రతపై అవగాహన పెంపొందించడంలో ఇటువంటి కార్యక్రమాలు కీలకపాత్ర పోషిస్తాయని తెలిపారు.



## చిన్నారి కావ్యశ్రీకి అండగా అంబటి వినయ్

### కన్నీరు పెట్టించిన విద్యుత్ ప్రమాదం

ప్రజాపక్షం/గోవిందరావుపేట: మండలం లోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన లావుడియా వాగా స్వాతి కుమార్తె కావ్యశ్రీ కి గత కొద్ది రోజుల క్రితం విద్యుత్ ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడింది ఆడిపాడిల్సిన ఎనిమేదళ్ల వయసులోనే ఈ విషాదం చోటు చేసుకోవడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఈ ఘటన జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నాయి ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారి కావ్యశ్రీని మంగళవారం బిఆర్ఎస్ నాయకులు అంబటి వినయ్ పరామర్శించారు ఐసీయూలో ఉన్న చిన్నారిని చూసి చలించిపోయిన ఆయనవైద్యులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితి అందుతున్న చికిత్స వివరాలు తెలుసుకున్నారు తరువాత చిన్నారి తల్లిదండ్రులను ఓదార్చి ధైర్యం చెప్పారు సామాన్య రైతు కుటుంబానికి చెందిన కావ్యశ్రీ వైద్య ఖర్చులు భారంగా మారిన నేపథ్యంలో అంబటి వినయ్ వెంటనే రూ 50 వేల ఆర్థిక సాయం అందించి తన మానవత్వాన్ని చాటుకున్నారు చిన్నారి కావ్యశ్రీ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన ఆయన కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటానని భరోసా ఇచ్చారు కష్టాల్లో ఉన్న కుటుంబానికి ఆయన అందించిన చేయూత బాధితుల్లో కొత్త ధైర్యాన్ని నింపింది.

# రైస్ మిల్లర్స్‌వెంటనే కటింగ్ ఆపాలి

ప్రజాపక్షం/గోవిందరావుపేట:మండలంలోని పసర గ్రామంలో రైతులు పండించిన పంటను కొనుగోలు చేసే విషయంలో అక్రమాలు జరుగుతున్నాయని రైస్ మిల్లర్లు నాలుగు నుండి 5 కిలోల వరకు తాలు తప్ప పేరుతో కటింగ్ చేస్తున్నారని దీన్ని అఖిల పక్ష రైతు సంఘాల నాయకులు తుమ్మల వెంకటరెడ్డి సూడి శ్రీనివాస రెడ్డి ఏనుగు రవీందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైస్ మిల్లర్లు కటింగ్ పేరుతో 4 నుండి 5కిలోల ధాన్యాన్ని కటింగ్ చేస్తూ రైతును నిలువునా ముంచు తున్నారని ఒక్కొక్క లారీకి 30నుంచి 40 వేల రూపాయలు నష్టం వస్తుందని ఆరుగాలం పంటను పండించిన రైతుకు చివరికి నిరాశ మిగులుతుందని ఆవేదన వ్యక్తం చేశారు ప్రభుత్వం కింటా ధాన్యానికి 16 కిలోలు తాలు తప్ప ఇతర ధాన్యాలు ఉన్నాతీసుకోవాలని చెప్తున్నా రైస్ మిల్లర్లు మాత్రం అంతాకన్నా తక్కువ ఉన్న ధాన్యాన్ని కటింగ్ చేయడం శోచనీయమన్నారు రైతులు ధాన్యం అమ్ముకాల సమయంలో తప్పనిసరిగా రసీదులు తీసువాలని కటింగ్ జరిగితే టోల్ ఫ్రీ నంబర్లకు ఫిర్యాదు చేయాలని సూచించారు అవసరమైతే కలెక్టర్ కార్యాలయం మంత్రి క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని రైతు సంఘాలు స్పష్టం చేశాయి కార్యక్రమంలో మండలంలోని వందలాది మంది రైతులు పాల్గొన్నారు.

# పాఠశాలల పరిసరాల్లో పోలీసుల ప్రత్యేక తనిఖీలు

ప్రజాపక్షం/ములుగు: ప్రజాపాలన...ప్రగతి ప్రణాళికలో భాగంగా ములుగు మండలంలోని పాఠశాల సమీపంలో ఉన్న దుకాణాలపై పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. పాఠశాలలకు 100 మీటర్ల పరిధిలో ఉన్న షాపులను నార్కోటిక్ డాగ్ సహాయంతో సబ్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా షాప్ యజమానులకు మత్తు పదార్థాలు అమ్మరాదని పోలీసులు కఠినంగా హెచ్చరించారు. విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకొని ఇలాంటి తనిఖీలు కొనసాగిస్తామని అధికారులు తెలిపారు. ఎస్ఐ చంద్రశేఖర్‌తో పాటు పోలీస్ స్టేషన్ సిబ్బంది, నార్కోటిక్ డాగ్ హ్యాండ్లర్ రమేష్ పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గొడుగుల పంపిణీ

ప్రజాపక్షం/ములుగు: ములుగు జిల్లా కేంద్రంలో ములుగు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో లయన్స్ పెద్ద గొడుగుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ములుగు లయన్స్ క్లబ్ లో నూతనంగా చేరిన ఎలగందుల మోహన్, వలస మధు, దొంతిరెడ్డి సురేందర్ రెడ్డి చేతుల మీదుగా చిరు వ్యాపారులకు గొడుగులు పంపిణీ చేయడం జరిగిందని లయన్స్ క్లబ్ అధ్యక్షులు దొంతిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఎండాకాలంలో చిరు వ్యాపారులు ఎండ వేడికి తట్టుకోలేక అవస్థలు పడుతున్నారని, వారికి కొంత ఉపశమనం కోసం ఈ యొక్క గొడుగులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గొడుగులు తీసుకున్న చిరు వ్యాపారులు మాట్లాడుతూ మా యొక్క బాధను అర్థం చేసుకొని మాకు గొడుగులు ఇచ్చి ఎండ నుండి ఉపశమనం కల్పించినందుకు ములుగు లయన్స్ క్లబ్ సభ్యులందరికి ధన్యవాదాలు తెలిపారు.

## ట్రైనీ కలెక్టర్‌ను కలిసిన నిమ్మల శ్రీనివాస్



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** సివిల్ సర్వీసెస్‌లో గత సంవత్సరం ఆల్ ఇండియా 11వ ర్యాంక్ సాధించి ఓరుగల్లు జిల్లా ఖ్యాతిని దేశ నలుమూలలా చాటిన సాయి శివాని, ప్రస్తుతం ట్రైనీ కలెక్టర్‌గా హనుమకొండ కలెక్టరేట్‌లో సోమవారం బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా ప్రముఖ సామాజికవేత్త , సాయిబాబా మందిర ధర్మకర్త నిమ్మల శ్రీనివాస్ మంగళవారం ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. సాయి భక్తురాలైన సాయి శివానికి బాబా విభూది ప్రసాదాన్ని అందజేసి వీలు చేసుకుని ఒక గురువారం మందిరానికి వచ్చి సాయినాథుని ఆశీస్సులు తీసుకోవాలని శ్రీనివాస్ కోరుతూ సాయి శివాని భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, తన సేవల ద్వారా పేదలకు, అవసరార్థులకు అండగా నిలుస్తూ మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు.సివిల్స్‌లో ఉన్నత ర్యాంక్ సాధించి ప్రజాసేవలో అడుగుపెట్టిన సాయి శివాని యువతకు ఆదర్శంగా నిలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.

## మాస్టర్లలో సంతకాలు తీసుకోవాలి

### నడికూడ ఏపీవో విద్యావతి

**ప్రజాపక్షం /నడికూడ :** నడికూడ మండలంలోని గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలు క్రమక్రమంగా పెరగడంతో ఉపాధి హామీ పనులు ఉపందుకున్నాయి.ఈ సందర్భంగా ఏపీఓ విద్యావతి మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలు ఉదయమే పనికి వెళ్లాలాని ఎండ దృష్ట్యా టోపీలు,టవళ్లు ధరించడం మంచిదని,చలవపందిళ్లు,వాటర్ జీపీలు ఏర్పాటు చేస్తున్నారు.కూలీలు ఓఆర్ఎస్ త్రాగడం మంచిదని పని కోసం డిమాండ్ పెట్టిన కూలీలందరూ పనికి వచ్చేలా చూసుకోవాలని పనికి వచ్చిన కూలీలకు మొదటిది,రెండో ఫోటో తీసుకోవాలని కూలీలకు సంబంధించి మాస్టర్లలో పనికి వచ్చిన కూలీలందరికీ సంతకాలను విధిగా తీసుకోవాలని పనికి సంబంధించిన కొలతలు కూలీలకు చూపిస్తూ రోజుకు 307 రూ.ల వేతనాలు పడే విధంగా వారికి తగిన సూచనలు ఇవ్వాలని మేట్లకు ఫోటో క్యాప్చరింగ్ పై అవగాహన కల్పించుకొని వారితో ఫోటో ఎన్ఎంఎంఎస్ ద్వారా క్యాప్చరింగ్ చేసేలా,నలభై మందికి ఒకరు క్యాప్చరింగ్ ఫోటో చేసేలా వారికి పెద్ద మొబైల్ ఉండాలని,ఎక్కువ మంది కూలీలను వచ్చే విధంగా చూడాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు తెలిపామని తెలియజేశారు.



# పెట్రోలు, డీజిల్ కొరత లేదు

### హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ రవి



**ప్రజాపక్షం/హనుమకొండ :** జిల్లాలో పెట్రోలు, డీజిల్ ఇంధన కొరత లేదని, వివిధ పెట్రోలియం సంస్థల ద్వారా డీజిల్, పెట్రోలు నిల్వలు అందుబాటులో ఉండే విధంగా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని ప్రజలు ఆందోళన చెందవద్దని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి అన్నారు.మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో జిల్లాలో పెట్రోలు, డీజిల్ సరఫరాపై పెట్రోలియం సంస్థల ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో ఎనర్జీ కమిటీ సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లాలో వివిధ పెట్రోలియం సంస్థల పెట్రోలు, డీజిల్ నిల్వలు గురించిన వివరాలను ఆయా సంస్థల ప్రతినిధులను అదనపు కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ రవి మాట్లాడుతూ జిల్లాలో పెట్రోలు డీజిల్ కొరత లేనప్పటికీ పెట్రోల్ బంకుల్లో డీజిల్ పెట్రోల్ కొరకు క్యూలైన్లో ఉంటున్నారని పేర్కొన్నారు. పెట్రోల్, డీజిల్ కొరత అంటూ అసత్య ప్రచారం జరుగుతుందని పేర్కొన్నారు. జిల్లాలో పెట్రోల్, డీజిల్ కు ఎలాంటి కొరత లేదని అన్నారు. పెట్రోల్ బంకుల్లో క్యూ లో ఉన్న వాహనదారులకు పెట్రోల్, డీజిల్ పోయాలని అన్నారు. అర్బన్ ప్రాంతంలో బాటిళ్లు, క్యాన్లలో పోయడం ద్వారా వాహనదారులకు ఇబ్బందులు కలుగుతున్నాయని అన్నారు. పెట్రోల్ బంకుల్లో పెట్రోల్ డీజిల్ కోసం వచ్చే వాహనాల వారికి ప్రాధాన్యత ఇచ్చి పెట్రోల్, డీజిల్ పోయాలన్నారు. జిల్లాలో పెట్రోలు, డీజిల్ కు ఎలాంటి కొరత లేదని, కొరత అంటూ జరుగుతున్న అసత్య ప్రచారాన్ని పెట్రోలియం సంస్థలు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఎండి వాజీద్ అలీ, జిల్లా రవాణా శాఖ అధికారి వేణుగోపాల్, డి డబ్ల్యు ఓ విశ్వజ, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి ప్రేమకళా, ఇండియన్ ఆయిల్, హిందుస్థాన్, భారత్ పెట్రోలియం సేల్స్ మేనేజర్లు, పాల్గొన్నారు.

## సోమాజిగూడ యశోదలో అత్యాధునిక 'గ్యాస్ట్రో' చికిత్సలు

### యశోద డాక్టర్ పెద్ది కిరణ్ వెల్లడి



**ప్రజాపక్షం /హనుమకొండ టౌన్ :**జీర్ణవ్యవస్థ,కాలేయ సంబంధిత వ్యాధులతో బాధపడే రోగులకు అంతర్జాతీయ స్థాయి వైద్యం ఇక సామాన్యులకు కూడా చేరువలో ఉందని సోమాజిగూడ యశోద హాస్పిటల్స్ గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగం వెల్లడించింది.అత్యాధునిక మౌలిక సదుపాయాలు, అనుభవజ్ఞులైన నిపుణులతో ఈ విభాగం ఇప్పుడు దక్షిణ భారతదేశంలోనే అగ్రగామి కేంద్రంగా సేవలందిస్తోందని ఆసుపత్రి వైద్యులు డాక్టర్ పెద్ది కిరణ్ పేర్కొన్నారు. రోగులకు సత్వరమే ఖచ్చితమైన వ్యాధి నిర్ధారణ చేసేందుకు వీలుగా హైడెఫినిషన్ ఇమేజింగ్ సిస్టమ్లతో కూడిన అత్యాధునిక ఎండోస్కోపీ సూట్లు ఇక్కడ అందుబాటులో ఉన్నాయని,24 గంటల అత్యవసర సేవలు, అడ్వాన్స్‌డ్ ఐసీయూ సపోర్ట్‌తో పాటు సీటీ , ఎమ్మారై, ఇంటర్వెన్షనల్ రేడియాలజీ వంటి హైఎండ్ డయాగ్నోస్టిక్ సేవలు ఒకే చోట లభిస్తాయని తెలిపారు. రోగులకు సమయం వృథా కాకుండా బ్లడ్ బ్యాంక్, రౌండ్‌దక్లాక్ ఫార్మసీ సేవలను కూడా ఆసుపత్రి సమకూరుస్తోందని, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరుగాంచిన గ్యాస్ట్రోఎంటరాలజిస్టుల పర్యవేక్షణలో ఇక్కడ చికిత్సలు జరుగుతున్నాయన్నారు. ముఖ్యంగా ఎసిడిటీ, రిఫ్లక్స్, దీర్ఘకాలిక కడుపు నొప్పి, అజీర్ణం, ఐబీఎస్, కాలేయ వ్యాధులైన ఫ్యాటీ లివర్, హెపటైటిస్, సిర్రోసిస్ లివర్ ఫెయిల్యూర్, అధునాతన పరీక్షలైన అప్పర్ GI ఎండోస్కోపీ, కొలొనోస్కోపీ ద్వారా క్యాన్సర్ వంటి వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించడం,ప్యాంక్రియాటైటిస్, జీర్ణాశయ రక్తస్రావం, ఉదర క్షయ వ్వంటి క్లిష్ట సమస్యలకు పరిష్కారం లభిస్తాయని తెలిపారు. కేవలం మందులతోనే కాకుండా, రోగి సంరక్షణలో భాగంగా ఆహార నియమాలు, జీవనశైలి మార్పులు, నివారణ చర్యలకు మేము అత్యంత ప్రాధాన్యత ఇస్తాం అని డాక్టర్ పెద్ది కిరణ్ తెలిపారు. అత్యాధునిక ఎండోస్కోపీ యూనిట్ ద్వారా కోత లేని (మినిమల్లీ ఇన్వేసివ్) చికిత్సలు అందించడం వల్ల రోగులు త్వరగా కోలుకునే అవకాశం ఉందని వైద్యులు స్పష్టం చేస్తున్నారు.జీర్ణకోశ సమస్యలతో బాధపడేవారు నిర్లక్ష్యం చేయకుండా ప్రారంభ దశలోనే నిపుణులను సంప్రదించడం ద్వారా దీర్ఘకాలిక సమస్యల నుండి బయటపడవచ్చని వారు సూచించారు.

# మేడే వారోత్సవాలను జయప్రదం చేయండి

### సిఐటియు జిల్లా కార్యదర్శి రాగుల రమేశ్

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** ప్రాణత్యాగాలతో సాధించుకున్న కార్మిక చట్టాలను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా, మేడే వారోత్సవాలను (మే 1 నుండి 7 వరకు) జయప్రదం చేయాలని సిఐటియు హనుమకొండ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ కార్మికులకు పిలుపునిచ్చారు.మంగళవారం రామ్ నగర్ లోని సుందరయ్య భవన్ లో తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా సమావేశం జిల్లా అధ్యక్షురాలు సుంచు రాజేశ్వరి అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రాగుల రమేష్ మాట్లాడుతూ 140 ఏళ్ల క్రితం చికాగో నగరంలో 8 గంటల పని దినం కోసం కార్మికులు చేసిన పోరాటం ప్రపంచ కార్మిక వర్గానికి దిక్సూచిగా నిలిచిందని గుర్తు చేశారు. ఆనాడు కార్మికులు చిందించిన రక్తం ఫలితంగానే 8 గంటల పని విధానం, సెలవులు, సౌకర్యాలు మరియు కనీస వేతన చట్టాలు ఏర్పడ్డాయని తెలియజేశారు.ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, వాటిని 4 కార్పొరేట్ అనుకూల లేబర్ కోడ్‌లుగా మార్చడం కార్మిక వర్గానికి పెను ప్రమాదమని రమేశ్ హెచ్చరించారు. 8గంటల పని దినాన్ని 12 గంటలకు పెంచే వెసులుబాటును ఈ కోడ్‌లు కల్పిస్తున్నాయని మండిపడ్డారు.యూనియన్లు పెట్టుకునే హక్కును, సమ్మె చేసే అధికారాన్ని ఈ కొత్త చట్టాలు నిర్వీర్యం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. హైర్ అండ్ ఫైర్ (కావాలన్నప్పుడు తీసుకోవడం, వద్దన్నప్పుడు తీసేయడం) పద్ధతి ద్వారా కార్మికులకు ఉద్యోగ భద్రత లేకుండా చేస్తున్నారని విమర్శించారు.రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుకోవడానికి, లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ మేడే ను వారం రోజుల పాటు గ్రామాలలో, కార్మిక వాడలలో వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలని కోరారు. మే 1న అన్ని గ్రామాలలో ,వార్డు లలో యూనియన్ ల అడ్డాల వద్ద ఎర్రజెండాలను ఎగురవేసి కార్మిక ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. ఆశ యూనియన్ జిల్లా నాయకులు యాకూబీ, బైరి శోభ, సిహెచ్ శ్రీవాణి, జనగాం శ్వేత, ఈసంపల్లి శోభ, రజిత, లీల, సంధ్య, నవమణి, సరిత, శోభ, పద్మ, పుతిలి, సుకన్య, పాల్గొన్నారు.




## ఐకెపి సెంటర్లో ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి

**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** మండలంలోని కేశిరెడ్డిపల్లి గ్రామంలో ఐకేపీ సెంటర్లో రైతులు పండించిన పంటను వెంటనే కొనుగోలు చేసి రైతుల ఖాతాలలో డబ్బులు జమ చేయాలని సీపీఎం మండల కమిటి సభ్యులు బైరగోని బలరాములు, రైతు సంఘం మండల అధ్యక్షులు ఎడబోయిన రవీందర్ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఐకేపీ సెంటర్‌ను వారు సందర్శించి మాట్లాడుతూ ఐకేపీ సెంటర్లో ధాన్యాన్ని పోసి 45 రోజులు గడుస్తున్నా ధాన్యాన్ని రైస్ మిల్లర్‌లకు పంపడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. వెంటనే రైతులకు గోనె సంచులు అందించి కాంటాలు వేసి సరిపడా లారీలను పంపించి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని లేదంటే సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బుచ్చిరెడ్డి, చెన్నయ్య, రాజు, ప్రశాంత్, సతీష్, సామిరెడ్డి, కర్ణాకర్, భూపాల్‌రెడ్డి, సత్తయ్య, లింగారెడ్డి, రాములమ్మ, సునంద, సత్యనారాయణ, రైతులు, పాల్గొన్నారు.

## కంచనపల్లి దుర్గమ్మ గుడిలో ప్రత్యేక పూజలు

**ప్రజాపక్షం/రఘునాథపల్లి:** మండలంలోని కంచనపల్లి గ్రామంలో దుర్గమ్మ పండుగ సందర్భంగా గ్రామ శివారులో నూతనంగా నిర్మించిన దుర్గమ్మ గుడిలో గ్రామ పెద్దల ఆహ్వానం మేరకు మంగళవారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు దుర్గామాత గుడికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుర్గామాత అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని కోరినట్లు ఆయన తెలిపారు. అంతకుముందు కంచనపల్లి పీఏసీఎస్ ఆద్వర్యంలో చేపట్టిన మక్కల కొనుగోలు కేంద్రానికి ఆయన వెళ్లి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. వారి సమస్యలను ఎమ్మెల్యే కడియం శ్రీహరి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు లింగాల జగదీష్ చందర్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు కోళ్ల రవిగౌడ్, కాంగ్రెస్ జిల్లా నాయకులు మహేందర్ రెడ్డి, బుచ్చయ్య గౌడ్, కంచనపల్లి గ్రామ సర్పంచ్ అబ్రహం, జనగామ వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ పర్శ సిద్దేశ్, ఈశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు.

## నూతన గృహ ప్రవేశ వేడుకలకు హాజరైన ఝాన్సిరెడ్డి

**ప్రజాపక్షం/పాలకుర్తి:** మండలంలోని పెద్ద తండా(కె) లో బానోత్ కాంతి రాందన్‌ల నూతన గృహ ప్రవేశం వేడుకలకు టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ హనుమాండ్ల ఝాన్సి రాజేందర్ రెడ్డి హాజరయ్యారు. నూతన దంపతులను ఆశీర్వదించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్ పర్సన్ మంజుల భాస్కర్, గ్రామ సర్పంచ్ బాలాజీ నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అద్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల కాంగ్రెస్ అద్యక్షుడు గిరగాని కుమారస్వామి, నాయకులు కుమార్, యాక సోమయ్య, యాకాంతరావు, తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్‌క్లబ్ మిలీనియం ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

**ప్రజాపక్షం/జనగామ టౌన్:** లయన్స్‌క్లబ్ మిలీనియం ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణి చేయడం జరిగింది. మంగళవారం మండల కేంద్రంలోని స్టార్ హాస్పిటల్ ముందు గల చలివేంద్రం నందు లయన్స్‌క్లబ్ మిలీనియం ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల నుంచి పనుల నిమిత్తం జనగామ జిల్లా కేంద్రానికి వచ్చే వారికి ఎండ వేడి వలన వడదెబ్బ నుండి ఉపశమనం కొరకు మజ్జిగను పంపిణి చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్రతినిధులు, పీఎస్టీ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



# జోగిపేటలోని ట్రాన్సిట్ హోంలో ఎస్పి సందర్శన

### విదేశీయులు , తమ దేశాలకు తిరిగి వెళ్లేవరకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలి

### ఎస్పీ పరితోష్ ఫంకజ్





**పజాఫక్షం/సంగారెడ్డి :** సంగారెడ్డి జిల్లా జోగిపేట సబ్ జైల్లో ఏర్పాటు చేసిన ట్రాన్సిట్ హోం (విదేశీయుల కేంద్రం)ను జిల్లా ఎస్పీ పరితోష్ ఫంకజ్ సందర్శిం చారు. ఈ సందర్బంగా ఎస్పీ మాట్లాడుతూ పాస్‌పోర్టు గడువు ముగిసిన వారు. ఇతర కారణాలతో ఇక్కడ ఉంచబడిన విదేశీయులను తమ దేశాలకు తిరిగి పంపించే వరకు టాన్సిట్ హోంలో భద్రతతో ఉంచుతు న్నామని తెలిపారు. ప్రస్తుతం 12 మంది విదేశీయులు ట్రాన్సిట్ హోంలో ఉన్నారని వారి భద్రతా దృష్ట్యా కట్టు దిట్టమైన చర్యలు చేపట్టినట్లు ఎస్పీ పేర్కొన్నారు. విదేశీ యులకు ఏలాంటి ఇబ్బందులు కలగకుండా అవసర మైన సదుపాయాలు కల్పిండం జరిగిందని నిబందన లకు అనుగుణంగా వారినిచూసుకోవాలని ట్రాన్సిట్ హోం అదికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జోగిపేట, సీఐ అనిల్ కుమార్, ఎస్ఐ పాండు, జైలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్‌లో ముదిరాజ్ సంఘం నాయకుల చేరికలు



**ప్రజాపక్షం/రామాయంపేట :** రామాయంపేట మున్సిపాలిటి పరిది లోని పలు వార్డులకు చెందిన ముదిరాజ్ సంఘం నాయకులు బిఆర్ఎ స్‌లో చేరారు. మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు నివాసంలో మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి నేతృత్వంలో మంగళవారం చేరికలు జరి గాయి. మహంకాళీ దేవాలయ డైరెక్టర్ గుడాల లింగం, ముదిరాజ్ సంఘం నాయకులు రెడ్డమైన నరేష్, పోచమ్మల కిషన్, దేవుని సర్వయ్య, రొయ్యల కిషన్‌తో పాటు సుమారు 50 మంది బిఆర్ఎస్‌లో చేరారు. వారికి మాజీ మంత్రి హరీష్‌రావు పార్టీ కండువా కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారికి, పార్టీ కోసం కష్టపడ్డ వారికి తప్పకుండా గుర్తింపు ఉంటుందని, వారిని అన్ని రకాల ఆదుకుంటా మని హరీష్‌రావు హామీ ఇచ్చినట్లు పార్టీ నాయకులు తెలిపారు. బిఆర్ ఎస్ పార్టీ సిద్దాంతాలకు, గత ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి పనులకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇంచార్జ్ కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మెన్ పల్లె జితెందర్‌గౌడ్, పుట్టి యాదగిరి, బాదె చంద్రం, కౌన్సిలర్లు చౌదరి చరిత, మద్దెల మాదవి రమేష్, కొక్కు ప్రవీణ్, నాయకులు చౌదరి సుప్రబాత్‌రావు, ఉమామహేశ్వర్, ఎస్కే హైమద్, హస్నోద్దీన్, రొయ్యల నవీన్, మద్దెల రమేష్, పుట్టి స్వామి, పోచమ్మల శివయ్య, దోమకొండ శ్రీనివాస్‌తో పాటు పాల్గొన్నారు.

### జాతీయ జీవనోపాధుల మిషన్ సెర్ప్ ఆధ్వర్యంలో

# మోడల్ మండల సమాఖ్యలు



**పజాఫక్షం/సంగారెడ్డి :** జాతీయ జీవనోపాధుల మిషన్ సెర్ప్ ఆధ్వర్యంలో మోడల్ మండల సమాఖ్యలు విజన్ బిల్డింగ్ పైన రాష్ట్ర స్థాయిలో శిక్షణా పొందు తున్న సీనియర్ సీఆర్పీ (60) సభ్యులు బృందము క్షేత్ర స్థాయి పర్యటనకు సంగారెడ్డి మండలం ఇస్మాయిల్ ఖాన్ పేట గ్రామానికి రావడం జరిగింది. సంస్థల బలో పేతం లో భాగంగా నిర్ణాయాదికారం నియంత్రణ నిర్వహణ పైన చర్చించి గ్రామంలోని స్వయం సహా యక సంఘాల సభ్యులతో కలిసి రాబోవు ఐదు సంవ త్సరాలకు ప్రతి సభ్యురాలి వ్యక్తిగత కుటుంబం గ్రామ ముపై కళలు తయారు చేయడం జరిగింది. అన్ని సంఘాల కళలు క్రోడీకరణ చేసే ఇట్టి కళల ఆదారంగా మార్పు అంశాలను తయారు చేయడం జరిగింది. అన్ని సంఘాల కళలు క్రోడీకరణ చేసే ఇట్టి కలల ఆదారంగా మార్పు అంభాలను తయారు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఎల్ఎం ప్రతినిధి రాజేంద్రప్ర సాద్, సార్ సెర్ప్ ఎం. బీమయ్య సార్ ,సీఎం స్వర్ణలత మేడమ్, డిపిఎం జాన్ కెనడీ ఏపిఎం శివకుమార్, ప్రేమలత ,శివలక్ష్మి, సీసీ అనంతరాములు , లక్ష్మి, వివోఏలు లక్ష్మి ,అనిత , సంఘాల ప్రతినిధులు పాల్గొ న్నారు.

## చైల్డ్ సేఫ్టీ అవగాహన కార్యక్రమం

**పజాఫక్షం/సంగారెడ్డి :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో బాగంగా చైల్డ్ సేఫ్టీ బాలల రక్షణపై భోరోసా సెంటర్ ఆద్వర్యంలో జేఎస్‌టీయు సుల్తాన్ పూర్, మహిళా డిగ్రి కాలేజ్ సంగారెడ్డి దక్కన డెవలప్మెంట్ సోసైట్ పస్తాపూర్ లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్బంగా భరసా కో ఆర్డినేటర్ దేవలక్ష్మి మాట్లాడుతూ లింగ సమానత్వం, సమాజంలో ఆడమగా తారతమ్య బేదం లేకుండా నడుచుకోవాలని సూచించారు. చైల్డ్ మ్యారేజ్ వలన మహిళలు ఎదుర్కొంటున్నా పరి ణామాల గురించి వివరించడం జరిగింది. సైబర్ నేరాల గురించి అవగాహన కల్పిస్తూ సైబర్ బాదితులకు విద్యావంతులే అధికం అని అమాయక ప్రజలే సైబర్ నేరగాళ్ల ఆసరగా చేసుకొని మొదట డబ్బులు వచ్చినట్లుగా ఆశ చూపి తరువాత సైబర్ నేరాలకు పాల్పడతారని సైబర్ నేరాల గురించి అవగాహన కలిగ అప్రమ తంగా ఉండాలని సూచించచడం జరిగింది. అత్యవసర సమయంలో ఉపయోగపడే డైల్ 100 మహిళా హెల్ప్‌లైన్ , 181 చైల్డ్‌హెల్ప్ లూన 1098 సెంటర్లను మీ ఫోన్ లో సేఫ్ చేసి పెట్టుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జేఎస్ టీయు ప్రిన్సి పల్ విశ్వనాథన్ మహిళా డిగ్రి కాలే అరుణ, దక్కన్ డెవలప్మెంట్ సోసైటీ డైరెక్టర్ దివ్య భరోసా, కోఆర్డినేటర్ దేవలక్ష్మి భరోసా సిబ్బంది స్థానిక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.







## బాల్య వివాహాలు నిర్మూలించాలి

### ఎస్సై శంకర్

**ప్రజాపక్షం/అల్లాదుర్గం :** బాల్య వివాహాల నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎస్ఐ శంకర్ కోరారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల్లో భాగంగా చిల్డ్రన్స్ సేఫ్టీ పై అవగాహన కార్య క్రమం మంగళవారం నిర్వహించారు. స్థానిక మండల ఐకెపి కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమాజంలో వస్తున్న మార్పుల కారణంగా ఆడపి ల్లలు వివక్షకు గురవుతున్నారని, దీనిని రూపుమాపాలంటే కుటుంబ వ్యవస్థలో మార్పులు రావాలని, అమ్మాయిలు ధైర్యంగా సమస్యలను ఎదుర్కొని అన్ని రంగాల్లో ముందుండాలని పేర్కొ న్నారు. ఆడపిల్లలకు 18 సంవత్సరాలు నిండిన తర్వాతనే పెళ్లిళ్లు చేయాలని, చిన్న వయసులో వివాహాలు చేయడం వల్ల ఎన్నో అన ర్థాలు జరిగే ఆస్కారం ఉందని, యుక్త వయసు వచ్చేవరకు ఆగి తల్లిదండ్రులు వివాహాలు జరిపించాలని సూచించారు. చిన్నప్పటి నుండి పాఠశాలల్లో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కలిగించా లని, స్మార్ట్ ఫోన్లు మంచికే వాడాలని, డ్రగ్స్ నిర్మూలనకు అందరు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ మల్లయ్య, ఎంపీడీవో వేద ప్రకాష్ రెడ్డి, డాక్టర్లు సారిక, అశ్విని, అంగన్వాడి సూపర్వైజర్ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## రెండు బైకులు.. ఢీ ఒకరి మృతి

**ప్రజాపక్షం/వెల్దుర్తి :** మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం ఆరెగూడెం వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొని ఒకరు మృతి చెందగా నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వెల్దుర్తి నుంచి ధర్మారం గ్రామానికి బైక్ పై వెళ్తున్న మార్కంటి శంకర్ (35), మరికంటి శ్రీనివాస్, అందుగుల పల్లి నుంచి వెల్దుర్తికి బైక్ పై వస్తున్న అక్క మల్ల వినేష్, నీరుడి పద్మ, నీరుడి రాజమణి ఆరెగూడెం డంపు యార్డు వద్ద రోడ్డుపై దాన్యం ఎండబెట్టడంతో ఒకవైపు ఉండే బైకులు ఎదురెదురుగా వచ్చి ఢీకొ న్నాయి. దీంతో మరకంటి శంకర్ కు తీవ్ర రక్త గాయాలు కావ డంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మర్కంటి శ్రీనివాస్ కు తీవ్ర గాయాలయి విషమంగా ఉండడంతో 108 అంబులెన్స్ లో తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మరో బైక్ పై ఉన్న ముగ్గురికి కూడా తీవ్ర గాయాలయ్యాయి. మృతుడు మరికంటి శంకర్ కు భార్య స్వప్న కొడుకు హర్షవర్ధన్ కూతురు హరిత సంఘటన స్థలాన్ని వెల్దుర్తి పోలీసులు చేరుకొని బాధితులను ఆస్ప త్రికి తరలించారు.

## బాల్యవివాహలను కట్టడి చేసి సురక్షిత సమాజాన్ని నిర్మించాలి

**ప్రజాపక్షం/మెదక్ :** ప్రజాపాలన 99 రోజుల ప్రగతి ప్రణాళికా కార్యక్రమంలో భాగంగా మెదక్ పట్టణ రాందాస్ చౌరస్తాలో మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్దుల శాఖ జిల్లా సంక్షేమ అధికారి హేమ భార్గవి ఆధ్వర్యంలో బాల్యవివాహం బతుకు ఆగం లనే నినాదంతో రాందాస్ చౌరస్తాలో మానవహారం చేపట్టారు. ఈ కార్యక్రమానికి మెదక్ అదనపు కలెక్టర్ నాగేష్ మెదక్ మున్సిపల్ చైర్మన్ రాధిక భూపతి రాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ బాల్య వివాహాలను కట్టడిచేసి ఆరోగ్యకరమైన, విద్యావంతమైన సురక్షిత సమాజాన్ని నిర్మించాల న్నారు. బాలికల సంరక్షణ కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్య క్రమాలు అనేక చట్టాలు మక్కులు తీసుకువచ్చిందని వాటిని సద్వి నిగం చేసుకోవాలని కోరారు.

అనంతరం బాల్యవివాహాలను రద్దు చేయాలని ప్రతిజ్ఞ చేశారు. బాల్య వివాహాల నివారణకు ప్రతి ఒక్కరికి సంపూర్ణ అవగాహన కల్పించాలని బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్ఓ జోజి, జిల్లా రవాణా శాఖ అధికారి వెంకటస్వామి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీరామ్, డీఈఓ విజయ, యువజన క్రీడల నిర్వ హణ అధికారి రమేష్ ఇతర శాఖల జిల్లా అధికారులు ప్రజా ప్రతి నిధులు వార్డు కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## బాల కార్మిక బాల్య వివాహాల పై అవగాహన చేసిన అధికారులు

ప్రజాపక్షం / లోకేశ్వరం : లోకేశ్వరం మండలంలోని మన్మద్ గ్రామంలో గ్రామ సర్పంచ్ జయ లలిత భోజన్న గ్రామస్తుల సమక్షంలో జి.పద్మావతి చైల్డ్ హెల్ప్ లైన్ ఆధ్వర్యంలో మన్మద్ గ్రామంలో బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాలు నిర్మూలన చేయాలని అందరూ సహకరించాలని తెలుపుతూ బాల పరిరక్షణ కమిటీ ఏర్పాటు చేశారు. అలాగే చైల్డ్ హెల్ప్ లైన్ టోల్ ఫ్రీ నెంబర్ 1098 నెంబర్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఐ. అశోక్ క్యాదర్శి మాలతి , ఆశా వర్కర్ మంజుల అంగాన్వాడి కే.పద్మ, సునిత గ్రామస్తులు కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కూచాడి శ్రీహరిరావుకు 'కాల్వ' లక్ష్మీ నర్సింహాస్వామి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం

ప్రజాపక్షం/దిలావర్‌పూర్ : మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కాల్వ లక్ష్మీ నర్సింహాస్వామి దేవాలయ బ్రహ్మోత్సవాలు ఈ నెల 29,30 తేదీల్లో బుధ, గురు వారాలు అత్యంత వైభవంగా జరగనున్నాయి. ఈ బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ ధర్మకర్తల మండలి సబ్యులు మాజీ డిసిసి అధ్యక్షులు, నిర్మల్ నియోజక వర్గ కాంగ్రేస్ అర్టీ ఇంచార్జి కూచాడి శ్రీహరి రావు గారిని మర్యాదూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. బ్రహ్మోత్సవాలకు విచ్చేసి స్వామివారిని దర్శించుకోవాల్సిందిగా వారు ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంగూర్ మహేందర్ , ధర్మకర్త పూదరి శివ మరియు ఇతర సభ్యులు పాల్గొన్నారు.

## డిపిఆర్ఒకు గవర్నర్ ప్రెస్ సెక్రటరీ అభినందనలు

ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : జిల్లా పౌర సంబంధాల అధికారిగా ఏడుకొండలు ఇటీవల బాధ్యతలు స్వీకరించగా.. మంగళవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో మంగళవారం రాష్ట్ర గవర్నర్ ప్రెస్ సెక్రటరీ మామిండ్ల దశరథం అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డీపీఆర్ఓ ఏడుకొండలుకు గవర్నర్ ప్రెస్ సెక్రటరీ మామిండ్ల దశరథం పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.


## కెజిబివిలో విద్యార్థినులకు సామాజిక అంశాలపై అవగాహన



ప్రజాపక్షం/ దిలావర్‌పూర్ : వెల్ఫేర్ వీక్ కార్యక్రమాల్లో భాగంగా దిలావర్‌పూర్ మండల కేంద్రంలోని కేజిబివి పాఠశాలలో టీనేజ్ గర్భాధారణ, బాల్య వివాహాలు మరియు మత్తు పదార్థాల వినియోగంపై బుధవారం బారీ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తహసిల్దార్, ఐజాజ్ ఖాన్, మండల విద్యాధికారి సదానందం హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ తక్కువ వయసులో గర్భం దాల్చడం వల్ల కలిగే తీవ్రమైన ఆరోగ్య సమస్యలను, సామాజిక ఇబ్బందులను విద్యార్థినులకు వివరించారు. బాల్య వివాహాలు జీవితాలను ఎలా చిన్నాభిన్నం చేస్తాయో వివరిస్తూ, చదువుపై ఏకాగ్రత వహించి ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. అనంతరం మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి అవగాహన కల్పించారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండి, సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని కోరారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ప్రసూన, ఎస్.ఐ. అపర్ణ, చైల్డ్ ప్రోటెక్షన్ టీం సభ్యులు శైలజ, కరుణ తదితరులు పాల్గొని విద్యార్థినులకు పలు సూచనలు చేశారు. సదస్సు ద్వారా విద్యార్థినిల్లో చైతన్యం పెంపొందించడమే కాకుండా, వారి హక్కులు మరియు భద్రతపై దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది మరియు విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రైతులపై ఆంక్షలు తొలగించి, పూర్తి పంటను కొనుగోలు చేయాలి

### బి.ఆర్.ఎస్ నేత ఇ. చిన్నారెడ్డి డిమాండ్



ప్రజాపక్షం / దిలావర్‌పూర్ : మొక్కజొన్న పండిచిన రైతులపై ప్రభుత్వం విధిస్తున్న కొనుగోలు ఆంక్షల పట్ల అన్నదాతలు తీవ్రంగా నష్టపోతున్నారని బి.ఆర్.ఎస్. పార్టీ నాయకులు ఇ.చిన్నారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆయన పత్రికా ముఖంగా మాట్లాడుతూ, రైతులు ఎకరానికి దాదాపు 40 క్వింటాళ్ల దిగుబడి సాధిస్తే ప్రభుత్వం కేవలం 26 క్వింటాళ్ళ 50 కేజీలు మాత్రమే కొనుగోలు చేస్తామని చెప్పడం సరికాదన్నారు. మిగిలిన పంటను రైతులు ఎక్కడా అమ్ముకోవాలో అర్థం కాక దళారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. కౌలు రైతుల సమస్యల గురించి మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో కౌలు రైతులకు రైతు బంధు ఇస్తామని హామీ ఇచ్చి ఓట్లు వేయించుకున్న ప్రభుత్వం, ఇప్పుడు వారిని దళారుల చేతుల్లో పెట్టిందని విమర్శించారు. పొలం కౌలుకు ఇచ్చిన యజమానులు ఉద్యోగ రిత్యా హైదరాబాద్, బెంగళూరు మరియు విదేశాలలో ఉంటున్నారని అటువంటప్పుడు బయోమెట్రిక్ నిబంధన పెట్టడం వల్ల కౌలు రైతులు తమ పంటను అమ్ముకోలేక పోతున్నారని చిన్నారెడ్డి వివరించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఎటువంటి నిబంధనలు ఆంక్షలు లేకుంగడా, రైతులు పండించిన మొత్తం మొక్కజొన్న పంటను కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులను నిండా ముంచే ఇటువంటి అనాలోచిత నిర్ణయాలను వెనక్కి తీసుకొని అన్నదాతలను ఆదుకోవాలని బి.ఆర్.ఎస్. పార్టీ తరపున ప్రభుత్వాన్ని కోరారు.

## కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన నిర్మల్ నియోజకవర్గ నేతలు

ప్రజాపక్షం / నిర్మల్ రూరల్: నిర్మల్ జిల్లా నూతన కలెక్టర్‌గా ఈ రోజు బాధ్యతలు స్వీకరించిన శ్రీ భవేష్ మిశ్రా ఐఏఎస్ గారిని జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో పలువురు ప్రజా ప్రతినిధులు మరియు నియోజెక వర్గ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. నిర్మల్ నియోజకవర్గ ఇంచార్జ్ కూచాడి శ్రీహరిరావు నేతృత్వంలో నాయకులు కలెక్టర్ గారికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నూతన కలెక్టర్ గారిని శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా అభివృద్ధి పథకంలో కలెక్టర్ గారికి తమ వంతు సహకారం ఉంటుందని ఈ సందర్భంగా వారు పేర్కొనానరు. కలెక్టర్ గారిని కలిసిన వారిలో మున్సిపల్ వైస్ చైర్మెన్ అప్పాల గణేష్ చక్రవర్తి జిల్లా గ్రంథాలయ సంస్థ చైరెట్మన్ అర్జుమంధ అలీ, ఏఎంసి చైర్మెన్ సోమ భీంరెడ్డి, సారంగాపూర్ ఏఎంసి చైర్మెన్ అబ్దుల్ హాదీ, మాజీ గ్రంథాలయ చైర్మెన్ ఎర్రవోతు రాజేందర్ ఇతర నాయకులు ఉన్నారు.

## ప్రయోజన పథకం (ఎన్.ఎఫ్.బి.ఎస్) సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాపక్షం/బోథ్ : జాతీయ కుటుంబ ప్రజల పథంలో భాగంగా అందూరు, ధన్నూర్‌బి గ్రామాలలో ఈ పథకం కింద దరఖాస్తు చేసుకున్న వారి ఇంటికి వెళ్లి బోథ్ ఎంపిడిఓ యల్ రమేష్ విచారణ చేపట్టడం జరిగింది వారి వెంట సర్పంచ్‌లు పెందూర్ పృథ్వీరాజ్, రోహిణి వినయ్ రెడ్డి ఏ.పి.ఓ. జగదేవురావు, పంచాయతీ కార్యదర్శి శిరీష తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ కుటుంబంలో ప్రధాన సంపాదకులు భర్త/భార్య మృతి చెంది మైనర్ పిల్లలు కలిగిన పేద కుటుంబాలకు జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద ప్రభుత్వం 20,000 తక్షణ సహాయం అందజేయనుంది అని తెలిపారు. ఇటీవల కుటుంబంలోని ప్రధాన సంపాదకులు మరణించనట్లయితే ఈ పథకం కింద మీ సేవలో అప్లై చేసుకుంటే విచారణ జరిపి అర్హులుగా గుర్తిస్తే డి.ఆర్.డి.ఓ. కలెక్టర్ అనుమతితో సెర్ప్ సీఈఓ కి పంపించి ఆమోదం తీసుకోవడం జరుగుతుంది ఆమోదం పొందిన అనంతరం లబ్దిదారుని అకౌంట్లో నేరుగా 20 వేల రూపాయలు జమ కావడం జరుగుతుంది అని తెలిపారు.

## రోడ్డు విస్తరణ పనుల్లో ఇండ్లకు నష్టం జరగకుండా చూడాలి

### ముత్తారం రోడ్డు విస్తరణ - బాధితుల ఆవేదన



ప్రజాపక్షం/ముత్తారం : పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రంలో చేపట్టిన రోడ్డు వెడల్పు పనుల వల్ల తమ నివాస గృహాలు,వ్యాపార సముదాయాలకు భారీగా నష్టం జరుగుతుందని ఆందోళన చెందుతూ, బాధితుల కుటుంబాలు ఆదివారం మాజీ జెడ్పిటిసి నాగినేని జగన్ మోహన్ రావు, స్థానిక సర్పంచ్ సూదాటి రవీందర్ రావు తోపాటు తదితర ప్రజాప్రతినిధులకు విన్నవించుకుంటున్నారు. రోడ్డు వెడల్పు పనుల్లో పేద, మధ్యతరగతి కుటుంబాల ఇండ్లు కూలిపోయే అవకాశం ఉందని, తమకు నిలువ నీడ లేకుండా చేయవద్దని బాధితులు నాయకులను వేడుకున్నారు.ఉన్న ఇళ్లకు కనీస నష్టం జరగకుండా రోడ్డు అలైన్మెంట్‌ను మార్చాలని లేదా వెడల్పును కొంత మేరకు కుదించాలని బాధితులు ప్రతిపాదించారు.బాధిత కుటుంబాలు తమ గోడును స్థానిక నాయకుల దృష్టికి తీసుకెళ్లగా,వారు సానుకూలంగా స్పందిస్తూ అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.రోడ్డు విస్తరణ అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని, కానీ తమ జీవనాధారమైన ఇళ్లను, షాపులను కాపాడాలని బాధితులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఘనంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ

ప్రజాపక్షం కుంటాల : రాజ్యాంగంలోని అన్ని వర్గాల ప్రజలకు హక్కులు కల్పించిన ఘనత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌కే దక్కుతుందని సర్పంచ్ మెట్టు రాజు అన్నారు. మంగళవారం మండలంలోని దౌనెల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సమాజంలోని అంటరానితనాన్ని నిర్మూలించేందుకు అంబేద్కర్ చేసిన కృషిని మరువలేనిదన్నారు. ఆయన రాజ్యాంగం ద్వారా సమాజంలోని అన్ని వర్గాల వారికి సమన్యాయం చేశారని కొనియాడారు. ఆయన స్పూర్తితో ప్రతి ఒక్కరూ ముదుకెళ్ళాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సాయినాథ్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మాజీ జడ్.పి. చైర్మెన్ జుట్టు అశోక్, ఐ.కె.ఆర్. పి.ఏ. నాలం శ్రీనివాస్ మాజీ సర్పంచ్. హైమద్ పాషా, మాజీ డిసిసి డైరెక్టర్ తుర్పాటి వెంకటేష్, జుట్టు మహేదర్, మగ్గిడి దిగంబర్, కరుణాకార్, శ్రావణ్ కుమార్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## భైంసాలోని డాక్టర్ అసోసియేషన్ భవనంలో కీర్తశేషులు డాక్టర్ సురేందర్ శ్రద్దాంజలి

ప్రజాపక్షం / భైంసా: భైంసా పట్టణంలో డాక్టర్స్ అసోసియేషన్ ఐఎంఎ భైంసా ఆధ్వర్యంలో శ్రద్దాంజలి ఘటించారు. ఈ సందర్భంగా రెండు నిమిషాలు మౌనం పాటించి ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. డాక్టర్ సురేందర్ ఈ ప్రాంతంలో చేసిన వైద్య సేవలు ప్రజల మనసుల్లో ఎపన్పటికి నిలిచిపోతాయని ఆయన లేని లోటు వైద్య రంగానికి తీరని నష్టమని డాక్టర్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా శస్త్ర చికిత్సలో ఏదైన ఆటంకం కలిగినప్పుడు వెంటనే స్పందించి తోటి డాక్టర్లకు సహాయం చేసే గొప్ప మనసున్న వైద్యుడిగా ఆయనను స్మరించుకున్నారు. వారి కుటుంబ సభ్యులకు ఈ దుఃశాన్ని భరించే ధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో భైంసా డాక్టర్స్ అసోసియేషన్ మరియు ఐఎంఎ భైంసా సభ్యులందరూ పాల్గొన్నారు.

## జొన్నల కొనుగోలు సెంటర్లు పెంచండి

### కలెక్టర్‌ని కలిసిన కాంగ్రెస్ పార్టీ బృందం



ప్రజాపక్షం / బోథ్ : బోథ్ నియోజకవర్గ వ్యాప్తంగా జొన్నల కొనుగోలు సెంటర్లు పెంచి రైతులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా ని కాంగ్రెస్ పార్టీ బృందం మంగళవారం కలిసి మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కనీసం ప్రతి మండలానికి రెండు సపెంటర్ల చొప్పున ఏర్పాట్లు చేసి జొన్నలు కొనుగోలుతో పాటు తరలింపుకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ బొడ్డు గంగారెడ్డి, కాంగ్రెస్ పాఋ్ట జిల్లా అధికార ప్రతినిధి పనుల చంటి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్, మాజీ ఏఎంసి డైరెక్టర్ మహ్మద్ అబ్రార్, సీనియర్ నాయకులు పన్నాల శమేందర్ రెడ్డి, కుమ్మరి పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన పలువురు అధికారులు

ప్రజాపక్షం నిర్మల్ రూరల్: జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన భవేశ్‌మిశ్రాను పలువురు అధికారులు, మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టరేట్‌లో నతన కలెక్టర్‌ను , జిల్లా ఎస్పీ జానకీ షర్మిల, భైంసా ఏఎస్పీ సాయికిరణ్, పలువురు జిల్లా అధికారులు వివిద శాఖల అధికారులు, ఉద్యోగులు సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి, పూల మొక్కలు పుష్పగుచ్ఛాలు అందించారు. శాలువాతో సన్మానించారు. తమని తాము కలెక్టర్‌కు పరిచయం చేసుకొని ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.